Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 31 - No.8
June 2025




అంత్యదినాల్లోని

## అపాయకరమైన సమాజం

5లో

# అయితే నీవు....

కళాశాల విద్యార్థులకు దేవుని సువార్త ప్రకటించే దర్శనం పొంది, పరిచర్య ఆరంభించి 71 సం॥లు గడిచిపోయాయి. "ప్రతి కాలేజీ కేంద్రంగా ఒక ఇయు విద్యార్థుల సాక్షి బృందం, వారిని బలపరిచే ఒక ఇజియఫ్ సమూహం" కలిగి ఉండాలనే నినాదం. అయితే ఈ 71 సంవత్సరాల కాలంలో మనం కేవలం 10% కంటే తక్కువ మంది విద్యార్థులను మాత్రమే చేరగలిగాం. దీనికి కారణాలు అన్వేషిస్తే, కొద్దిమంది మాత్రమే దేవుని యెడల భయభక్తులు, మంచి సాక్ష్యం కలిగి పరిచర్యలో పాల్గొంటుంటే, కొంత మంది క్రైస్తవ విలువలతో రాజీపడి జీవిస్తున్నారు. పరిచర్యను క్రీస్తు చూపిన పంథాలో కాకుండా లోకం పోకడల్లో చేయాలంటున్నారు. నేడు మనం వ్యక్తిగత, పరిచర్య జీవితంలో ఫలాలు లేక యాంత్రికంగా వేషధారణతో జీవిస్తున్న దినాల్లో ఉన్నాం.

"...జనులు హితబోధను సహింపక, దురద చెవులుగలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసుకొని, సత్యమునకు చెవినియ్యక కల్పనా కథలవైపు తిరుగుకాలము వచ్చునని" (2 తిమోతి 4:3,4) పౌలు తెలియజేస్తున్నాడు. ప్రజలు సత్యాన్ని గ్రహించరు, సత్యాన్ని వినడానికి ఇష్టపడరు. దీనికి బదులు వారి ఆకాంక్షకు అనుకూలమైన, ఊహాజనితమైన తియ్యని మాటలను, విషయాలను బోధించే బోధకులను వారు ఏర్పాటు చేసుకొంటారు. "దురద చెవులు" అనే రోగము వారికి అంటుకుంది. దురద చెవులు అంటే, 'క్రొత్త విషయాల కోసం దురద'. ఆసక్తికరమైన, మసాలా దట్టించిన సమాచారం కోసం అర్రులు చాచే పరిస్థితి. నిజానికి వీరు సత్యం వినకుండా తమ చెవులు మూసుకున్నారు (అపో.కా. 7:57). దేవుని వాక్యాన్ని బట్టి బోధకులను ఇష్టపడరు గానీ, వారికి నచ్చినట్లు బోధిస్తే ఇష్టపడతారు. ఇంకా హీనమైన విషయం ఏమిటంటే, బోధను విని ఆ బోధ దేవుని వాక్యానుసారంగా ఉన్నదా లేదా అని నిర్ణయించరు. వారు ఏమి వినాలో నిర్ణయించుకొని, వారికి నచ్చిన విషయాలను బోధించే బోధకులను ఎంపిక చేసుకొంటారు.

ఆనాటి పరిస్థితులకు తిమోతి ఎలా ప్రతిస్పందించాలని పౌలు కోరుతున్నాడు? "అయితే నీవు" (వ5) దీనికి భిన్నమైన దానిని చేయమని పౌలు తిమోతిని హెచ్చరిస్తున్నాడు. తన కాలంలో ఉన్న పోకడలను అతను ఏ మాత్రం అనుకరించడానికి వీల్లేదని చెబుతూ ఎలా నడుచుకోవాలో మూడు ఆజ్ఞలను పౌలు రాస్తున్నాడు.

**1. నిలబడు:** తమ ఆలోచనల్లోనూ, ప్రవర్తనలోనూ ప్రజలు నిలకడ లేకుండా, దేవున్ని విడిచి లోకాశలవైపు పరుగెత్తుచున్నందున తిమోతిని "మితముగా ఉండమంటున్నాడు". దీనికి స్థిరమైన బుద్ధి, ఆశానిగ్రహం కలిగివుండడం అని అర్థం. తప్పుడు బోధలు, ఆకర్షణీయమైన క్రొత్త బోధలతో ప్రజలు మత్తులై, విశ్వాసంలో నిలకడ లేకుండా ఉన్నప్పుడు – యథార్థంగా దేవున్ని అనుసరించే వారు జాగరూకత, స్థిరబుద్ధితో దేవుని కోసం నిలబడాలి. అటూఇటూ కొట్టుకొని పోకుండా విశ్వాసంలో స్థిరంగా, దేవుని కోసం నిలబడాలంటే ఆయనతో సహవాసంలో నిలిచి ఉండాలి (యోహాను15:5). నిలిచి వుండాలంటే దేవునితో సమయాన్ని గడపాలి. దేవునితో సన్నిహిత సహవాసం చేసేవారు, ఆయనలో నిలుచున్నవారు దేవుని క్రియాశీల ప్రేమను తమ అనుదిన జీవితాల్లో వ్యక్తీకరిస్తారు. వారి జీవితాలు మాటలకు పరిమితంగాక క్రియలతోకూడి ఉంటాయి. వారు దేవునికోసం రోషం కలిగి జీవిస్తారు.

**2. సేవ చెయ్యి:** ప్రజలు నిజమైన సువార్తను పూర్తిగా విస్మరించినందున, "సువార్తికుని పనిచేయమని, సువార్తను ప్రకటించడం నీ జీవితాశయంగా పెట్టుకోమని" తిమోతిని పౌలు హెచ్చరిస్తున్నాడు. యవ్వనస్థుడైన తిమోతి పరిచర్య ఎలా చేయాలో చెప్పాడు. జెట్టివలె, వ్యవసాయకునివలె, సైనికునివలె క్రమశిక్షణతో, నిబద్ధతతో, సహనంతో కష్టపడి పనిచేయాలని బోధించాడు. సువార్త చెడిపోకుండా దాచిపెట్టే వస్తువులాంటిది కాదు. దాన్ని దాచిపెట్టకుండా వ్యాప్తి చేయాలి.

**3. విజయం సాధించు:** తమకు ఇష్టమైన బోధను బోధించే సేవకుల వైపు ప్రజలు తిరిగి తిమోతిని విడిచిపెట్టినప్పటికీ, "నీ పరిచర్యను సంపూర్ణంగా జరిగించు" అని పౌలు హెచ్చరిస్తున్నాడు. గ్రీకు భాషలో "సంపూర్ణంగా జరిగించు" అనే క్రియాపదం, అపో.కా. 12:25లో "పరిచర్యను నెరవేర్చిన" అనే క్రియాపదం ఒక్కటే. యేసు క్రీస్తు ప్రభువు పరిచర్యను సంపూర్తి చేసినట్లుగా, పౌలు పరిచర్యను నెరవేర్చినట్లుగానే, తిమోతి పట్టుదలతో తన పనిని పూర్తి చేయాల్సి ఉందని చెబుతున్నాడు. అలాగే దేవుడు మనకప్పగించిన విద్యార్థుల పరిచర్యను సంపూర్తిచేసే వారంగా ఉండాలి.

ఆర్.ఎ.టోరి ఇలా అంటాడు "పరిచర్య కోసం దేవుడు ఒక అందమైన పాత్రను కోరుకోవడం లేదు. ఒక శుద్ధమైన పాత్రను కోరుకుంటున్నాడు". గనుక నిలకడతో కూడిన పరిశుద్ధతను, ప్రార్థనను, దృఢచిత్తాన్ని కలిగి మారుతున్న సమాజములో మారని విలువలను ఎల్లప్పుడు అభ్యాసము చేస్తూ స్థిరంగా నిలబడి సేవచేయుటకు, ఆ సేవలో విజయాలు సాధించడానికి దేవుడు మనకు సహాయం చేయును గాక!

– బి. జయన్న, జమ్మలమడుగు

# విద్యార్థి జ్వాల



Vol. 31, No. 8. June 2025
A Publication of
Union of Evangelical Students of India



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



SUBSCRIPTION CHARGES:

STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Years) - Rs. 400
GRADUATES (3 Years) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCRIPTION:

The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account Name : UESI Publication Trust, Andhra Pradesh**
**Account No : 43362371247,**
**SBI Nambur Branch**
**IFSC: SBIN0011994**
**Merchant Name: UESI PUBLICATION TRUST ANDHRA PRADESH**
**UPI ID : uesiptap@sbi**



CONTACT:

The Editor
Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



UPCOMING TOPICS:

July: The Man God Uses
August: Evangelism
September: Core Values

**Note:** Please send your writeups on or before **10th of every month**


# విలువలతో కూడిన జీవితం

క్రైస్తవ జీవితంలో శీలము (Character) చాలా ప్రాముఖ్యమైనది. "ఒక వ్యక్తికి ఏమున్నది, లేదా అతను ఏమి చేస్తాడు అనే దానికన్నా అతడు ఎలాంటివాడు అన్నదే చాలా ప్రాముఖ్యం". మన నైపుణ్యాలు మన గొప్పతనాన్ని తెలియజేస్తాయి. మన పని మన సామర్థ్యాన్ని తెలియజేస్తుంది, కానీ మన శీలము మన విలువను తెలియజేస్తుంది.

నేటి క్రైస్తవ సమాజంలో స్థానిక సంఘాలు, సంఘ అనుబంధ సంస్థలు, శాఖలు మొదలగు వాటిలో ఈ శీలము గూర్చి చాలా తీవ్రమైన సమస్యలు ఉన్నాయి. విశ్వాసులు దీనిపై దృష్టిపెట్టకుండా, మిగిలిన విషయాలపై అంటే, బోధించడం, సౌవార్తీకరణ, సంఘాలను కట్టడం, ఇతర పరిచర్యలు, సాంప్రదాయ క్రైస్తవ కార్యక్రమాలపై దృష్టిపెడుతున్నారు. ప్రభువిచ్చిన విలువైన పరిచర్యను విలువలు లేని జీవితాలతో చేస్తున్నారు. అందువల్ల క్రైస్తవ పరిచర్య సమాజంలో చూపించాల్సిన ప్రభావాన్ని చూపించలేకపోతుంది. భావితరానికి బాటగా విలువలు కలిగిన జీవితం ఉండాలంటే దేవునితో సమయం గడుపుతూ ప్రవర్తనను సరిచేసుకోవాలి, క్రమశిక్షణను కలిగి ఉండాలి, ఆత్మీయ పోరాటాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.

## లోపలి పేజీల్లో...


- అయితే నీవు... - 2
- విలువలతో కూడిన జీవితం - 3
- ఉత్తమ మార్గం - సృష్టించడమే - 4
- అంత్యదినాల్లోని అపాయకరమైన సమాజం - 5
- అంత్యదినాల్లో అవలక్షణాలు - 9
- అంత్యదినాల్లో మన జీవితం, పరిచర్య క్రీస్తును పోలి ఉండాలి - 12
- పరిచర్య ప్రభువులా - 16
- ప్రేమ పూర్వక నాయకత్వం - 17
- సెయింట్ ఆంబ్రోస్ - 18
- రీల్స్ పిచ్చి - 21
- ఏకత్వము - మనమిద్దరం ఒక్కటే - 23
- మాట్లాడుకోండి! - 28
- అహం లక్షణాలు - 30
- సేవక నాయకత్వం - 31
- నాయకుడంటే నీలా ఉండాలి! - 32

# ఉత్తమ మార్గం - సృష్టించడమే

"భవిష్యత్‌ను అంచనా వేయడానికి ఉత్తమ మార్గం దానిని సృష్టించడం" అంటారు ప్రముఖ రచయిత పీటర్ డ్రక్కర్. శుబ్‌మన్ గిల్ జీవితాన్ని పరిశీలిస్తే ఇది మనకు స్పష్టంగా అర్థం అవుతుంది. 25 ఏళ్ళకే భారత క్రికెట్ టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టడం మాటలు కాదు. కానీ తన అంతరంగపు ఆశ నెరవేర్చుకొనేందుకు అహర్నిశలు, అలుపెరుగక శ్రమించడం, అంకిత భావంతో జట్టుని ఆదుకోవడం తన జీవనశైలిగా మారాయి.

విద్యార్థి పరిచర్యలో అహర్నిశలు శ్రమిస్తున్న మన విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ ఉత్తమ భవిష్యత్ చూడాలని, ఉన్న స్థితి నుండి ఉన్నతమైన స్థితిలోకి వెళ్ళాలని ఆశిస్తూనే ఉన్నాం. అయితే అది మన చేతుల్లోనే ఉంది. గత సంవత్సరమంతా జరిగించిన పరిచర్య కొరకు దేవునికి కృతజ్ఞతలు చెల్లించాం. దేవుడు మన జీవితాల ద్వారా సాధించిన విషయాల కొరకు సంతోషిస్తూనే, గత సంవత్సరం జరిగిన లోపాలను సరిచేసుకొంటూ ముందుకు వెళ్దాం. మహోన్నతుడైన దేవుడు మనలాంటి వాళ్ళ మీద ఆశపెట్టుకున్నప్పుడు మనం ఏదైనా ఆయన కొరకు చేయాలి. గిల్ చిన్నగా ఉన్నప్పుడు అతడి మీద భారత్‌కి పెద్దగా అంచనాలు లేవు. కానీ మనం చిన్నగా ఉన్నప్పుడే, ఇంకా చెప్పాలంటే మనం పుట్టక ముందు, భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు, భూమికి పునాదులు వేయబడక ముందే మన మీద దేవునికి గొప్ప ఆశలు ఉన్నాయి. ఆయన ఆశల్ని నెరవేర్చే ప్రక్రియలో మంచి భవిష్యత్‌ను ఆశించాలి. ఆశించడం అంటే దానిని సృష్టించాలి. సృష్టించడం మన స్వహస్తాలల్లోనే సార్వభౌముడు పెట్టాడు. సామాన్య విశ్వాసుల్ని సత్యవంతుని పోలిన నాయకులుగా తీర్చిదిద్దాలంటే, మన అలుపెరుగని పోరాటం, అభ్యాసం కొనసాగుతూనే ఉండాలి. క్రీస్తుని పోలిన మన నాయకత్వ జీవన శైలిని చూసి, మన తమ్ముళ్ళు, చెల్లెళ్ళు మనలాగే ఆయన పోలికలోకి మారతారు. సీనియర్ క్రికెటర్స్‌ని చూసి 'గిల్' గొప్పవాడైనట్లుగా మనల్ని చూసి మన తరం వారు గొప్పవారు కావాలి. అంటే మనం గొప్పవారుగా తయారు కావాలి. అది మన స్వహస్తాల్లోనే ఉందని గ్రహించాలి. సర్వోన్నతుని సహకారంతో మనం సేవక నాయకులుగా ఉండాలనుకొంటే, దాన్ని మనం సృష్టించాలి. భవిష్యత్‌ను అంచనా వేయడానికి ఉత్తమ మార్గం దానిని సృష్టించడం అని మన జీవన శైలి ద్వారా నిరూపించాలి. అలా మనం మారేందుకు మహోన్నతుని సహకారం ఆశిస్తూ....

ఆయన ప్రణాళికలో మీ....

**ఆర్. శ్రీనివాస్**

యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు




కవర్ కథనం

# అంత్యదినాల్లోని అపాయకరమైన సమాజం

దేవుని వాక్యమునకు కాలముతో సంబంధం లేదు. అది అన్ని కాలములకు సంబంధించిన సత్యాన్ని నిక్కచ్చిగా వివరించే ఆత్మఖడ్గం. అదే సందర్భంలో దేవుని వాక్యం మన జీవితాలను యధాతథంగా చూపించే అద్భుత సాధనం, కొన్ని కాలములను, సమయములను గురించి దేవుని వాక్యం వివరించేటప్పుడు వాడిన పద ప్రయోగం, ఆత్మదేవుని అద్భుత విశ్లేషణను, జ్ఞానాన్ని తెలియచేస్తుంది. 2 తిమోతి పత్రికలో పౌలు ద్వారా రాయించిన మాటలు వాస్తవ పరిస్థితులకు అద్దం పడతాయి. ఈ భాగంలో గ్రంథ కర్త అంత్యదినములలో అపాయకరమైన కాలములను గురించి, ఆ కాలములో గల సమాజములో నివసించే అపాయకరమైన వ్యక్తుల గురించి వివరించాడు (2 తిమోతి 3:1-5). పౌలు భక్తుడు రాసిన ఈ పత్రికలు రాయబడిన మూల భాష గ్రీకు భాష. ఇక్కడ వాడబడిన కొన్ని పదములు పాతనిబంధనలో ఎక్కడా వాడబడలేదు. ఈ భాషా ప్రయోగాన్ని అర్థం చేసుకోవడానికి, పౌలు ద్వారా పరిశుద్ధాత్మ దేవుడు రాయించిన వ్యక్తుల లక్షణాలను అర్థం చేసుకోవడానికి "మూల భాషలోని అర్థాన్ని గ్రహించడం తప్పనిసరి.

ఈ చివరి దినాలు చాలా అపాయకరమైనవిగా, కఠినమైనవిగా, హింసాత్మకమైనవిగా చెప్పడమైనది. అయితే ఈ అంత్యదినముల ప్రారంభం ఎప్పటి నుండి? అన్న ప్రశ్నకు ముందుగా జవాబు వెదుకుదాం. ప్రభువు ఈ విషయాలను మొదటి శతాబ్దంలోనే రాయించాడు. అప్పుడే అవి అంత్య దినాలుగా చెప్పబడ్డాయి. బైబిల్ పండితులు ప్రభువు మొదటి రాకడ నుండి, రెండవ రాకడ మధ్యకాలాన్ని అంత్యకాలముగానే పరిగణించాలని నిర్ధారించారు. అయితే ప్రభువు వారి రెండవ రాకడ దినము సమీపించేకొలది ఈ అపాయకర వ్యక్తుల స్వభావం ప్రపంచంలో మరింత స్పష్టంగా, అధిక మోతాదులో గుర్తించగలమని తెలుస్తుంది. ప్రస్తుత కాల పరిస్థితులు దీనికి నిదర్శనం. ఈ వ్యక్తుల గురించి వారి ప్రభావం గురించి కొద్ది విషయాలు తెలుసుకుందాం.

### 1. స్వార్థ ప్రియులు (Lovers of self) (philautos)

అంత్యదినములలో గల అపాయకర వ్యక్తులలో ప్రథమ శ్రేణి వ్యక్తులు స్వార్థ ప్రియులు. దేవుని వాక్యం చాలా స్పష్టంగా మానవ జీవితంలో గల అపవిత్రతకు, క్షీణతకు ప్రధాన కారణం అతనిలోని దేవునికి వ్యతిరేకమైన 'మనస్సు' అని యిర్మీయా 17:9 లో వివరించింది. "హృదయము అన్నిటికంటె మోసకరమైనది. అది ఘోరమైన వ్యాధి గలది. దానిని గ్రహింప గలవాడెవడు?" "నేను" అనే స్వార్థం నివసించే స్థానమే 'మనస్సు'. దానిని



దేవునివాక్యం 'హృదయం' అని పిలుస్తుంది. క్రొత్తనిబంధన దీనిని 'పాతస్వభావం' అనికూడా పిలుస్తుంది. ఇది మనలోని ప్రతి దైవ విరుద్ధ కోరి కకు మూలము. మనందరిలో స్వాభావికమైన స్వీయప్రేమ ఉంటుంది. స్వార్థ ప్రియులు ఈ స్వార్థమును తమకు యజమానిగా చేసుకొని వానిని పూజిస్తారు. వాని ఆశలకు, కోరికలకు తమ్మును తాము అప్పగించుకుంటారు. వీరు దేవుని పట్ల, తోటి మానవుల పట్ల ప్రేమకు బదులు శరీరాశలకు, సుఖభోగాలకు పెద్దపీట వేస్తారు. తమ భార్య, పిల్లలు, స్నేహితులు, పొరుగు వారు అందరిని ప్రక్కన పెట్టి కేవలము తమను తాము అత్యధికంగా ప్రేమించుకుంటారు. తాను కోరుకున్న విషయాలు, అవి చేయకూడనివి అయినా, ఇతరుల మనస్సు కష్టపెట్టాల్సి వచ్చినా చేయడానికి వెనుకాడరు. వీరి మానసిక దృక్పథం పరిశీలిస్తే, ప్రతి విషయం, ప్రతి వ్యక్తి తన చుట్టూ పరిభ్రమించాలనుకుంటారు. అనగా తానే అన్నింటిలో కేంద్ర స్థానంలో ఉండాల నే కోరిక స్వార్థ ప్రియులను పరిపాలిస్తుంది. వ్యక్తిగత సంతోషాలు, శరీర ఆశల మీద గల ధ్యాస, అక్కరలోవున్న నిర్భాగ్యుల ఆక్రందనలపై ఉండదు. వీరు తమను తాము దేవుని స్థానములో పెట్టుకొని తమ స్వార్థ పూరిత కోరికలు తీర్చుకోవడమే గురిగా పెట్టుకుంటారు.

మన సహవాసాలలో, సంఘాలలో వీరి ప్రభావం చాలా ప్రమాదకర పరిస్థితులను కలుగ చేస్తుంది. దేవుని వాక్యం 1 కొరింథీ 13:5లో "ప్రేమ స్వప్రయోజనమును విచారించుకొనదు" అని ఘోషిస్తుండగా వీరు స్వప్రయోజనాన్ని కోరుకుంటారు. వీరి ద్వారా తోటి విశ్వాసులు తీవ్ర మనస్తాపానికి, కృంగుదలకు లోనౌతారు. వీరు తమ స్వప్రయోజనం కొరకు వ్యక్తులను వాడుకుంటారు, దోచుకుంటారు. ఈ 'స్వార్థం' అని పిలువబడుచున్న పాత పురుషుని క్రీస్తుతోకూడా సిలువ వేయబడిన వానిగా ఎంచుకోవాలని రోమా 6:6 చెబుతుంది.

### 2. ధనాపేక్షులు (Lovers of money)

ఒక వ్యక్తి ధనం మీద మితిమీరిన ప్రేమతో నింపబడినప్పుడు వానిని ధనాపేక్షుడు అంటారు. అట్టివారు ధనం కోసమే బ్రతుకుతారు. దాని కోసం ఆతురత కలిగి ఉంటారు. తమకోసమే ధనాన్ని



కూర్చుకుంటారు. ఈ విధమైన ధనాశ స్వార్థంతో నిండిన హృదయంలో నుండి స్వాభావికంగా వస్తుంది. సెల్ఫ్ లవ్ నుండి ఈ లక్షణం రావడం వలన అది అహమును తృప్తి పరుస్తుంది.

"ధనాశ సమస్త కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తాము పొడుచుకొని" (1 తిమోతి 6:10). ప్రాస్పరిటీ గాస్పల్ చెప్పే బోధకులందరు ఈ కోవకే చెందిన వారని ప్రఖ్యాత బైబిల్ వ్యాఖ్యాన కర్త వైన్ బార్బర్ అన్నాడు. సమయానికి మించి పని చేస్తూ ధనవంతుడనై పోవాలనుకునే వారందరూ ధనాపేక్షుల కోవకు చెందిన వారే. వారు ధనవంతులా లేక బీదవారా అనేది ముఖ్యంకాదు గాని వారి దృక్పథం వారి గురించి చెప్తుంది.

మనం నివసిస్తున్న ఈ విశ్వంలో దేవుడు సార్వభౌముడు, ఈ లోకంలో మనుష్యులు వస్తువులు కూడా ఉంటాయి. మనము సార్వభౌముడైన దేవుని ఆరాధించబద్ధులము, వస్తువులను జ్ఞానయుక్తంగా విచక్షణతో వాడుకోవాలి. కాని ఎప్పుడైతే మనలను మనము, ధనాన్ని పూజించడం మొదలు పెడతామో దేవుని నిర్లక్ష్యపెడతాము, వస్తువులను ప్రేమిస్తాము, మనుష్యులను వాడుకోవడం అలవాటై పోతుంది.

విశ్వాసులు, గ్రాడ్యుయేట్స్ ధనాపేక్ష అనే ఉచ్చులో పడి కొందరు పరిచర్యకు దూరం అయ్యారు, మరి కొందరు అప్పుల్లో కూరుకు పోయారు. ధనాపేక్ష దేవుని సహవాసం నుండి మనలను దూరం చేస్తుంది. కుటుంబానికి ఇవ్వవలసిన సమయం దొంగిలించి చివరకు కుటుంబాన్ని కూడా దూరం చేస్తుంది. తస్మాత్ జాగ్రత్త! జాగరూకులమై దేవుడు మనకు అనుగ్రహించిన దానితో తృప్తిగా జీవిద్దాం.

### 3. అనురాగ రహితులు (unloving) Astorgoi (Greek)

వీరు స్వాభావికంగా కుటుంబ సభ్యుల మధ్య

ఉండవలసిన ప్రేమానురాగాలు లేనివారు. ఇక్కడ, వాడబడిన గ్రీకు పదం storge. అనగా కుటుంబ ప్రేమ. కుటుంబాన్ని నిలబెట్టేది ప్రేమానురాగాలే! ఈ అపాయకరమైన కాలంలో ఉండే మనుష్యులు తమ కుటుంబ సభ్యులను కూడా ప్రేమించలేని పరిస్థితి గలవారు. ఆ వ్యక్తులు తమ్మును తాము అధికంగా ప్రేమించుకోవడమే దీనికి గల మూల కారణం. తమ కోరికలు, ఆశలు, ఇష్టాలు, అల వాట్లు తీర్చుకోడానికి కుటుంబాన్ని, వ్యక్తులను లెక్క చేయకుండా వారిని పట్టించుకోకుండా ఉంటారు. సమాజంలో మనం చూసే త్రాగుబోతులు, జూదగాళ్ళు, వ్యభిచారులు, సుఖభోగాలకు అల వాటు పడిన వాళ్ళు ఈ కోవకు వస్తారు.

గ్రీకు భాషలో ఎస్టోర్గాస్ Astorgos అనే పదాన్ని అనేక పురుషులతో లైంగిక సంబంధం పెట్టుకున్న స్త్రీకి వాడతారు. తద్వార ఆమె తాను ప్రేమించవలసిన తన భర్త పట్ల చూపవలసిన ప్రేమను చూపలేని స్త్రీగా ఉంటుంది. 'ఎస్టోర్గాస్' అనే పదాన్ని గ్రీకు భాషలో తన స్వంత పిల్లల ను పట్టించుకోని జంతువుకు కూడా వాడతారు. యేసుక్రీస్తు ప్రభువును ఎరుగని ప్రజలలో కూడా సహజసిద్ధమైన కుటుంబ ప్రేమలు వుంటాయి. కానీ అంత్య దినములలో అట్టి సహజ ప్రేమలు వారి స్వార్థ ప్రేమ చేత తుడిచి పెట్టుకు పోతాయి. స్త్రీ, పురుషులకు వారివారి ఆశలు, కోరికలు, సుఖభోగాలు, అలవాట్లు తీర్చు కోవడమే ప్రధానంగా అవడం వలన కుటుంబ ప్రేమలు నశిస్తాయి. ఈ దినాలలో పిల్లలు కలిగి ఉండడం తమ కోర్కెలు తీర్చుకోవడానికి, తమ స్వేచ్ఛకు ఆటంకము అని, పిల్లలు లేకుండా చేసుకునే కుటుంబాలు పాశ్చాత్య దేశాలలో ప్రాచుర్యం సంతరించుకున్నాయి. వీరిని DINK అని పిలుస్తారు, (Duel Income No Kids) పిల్లల మీద ఉండవలసిన సహజ ప్రేమకూడా వీరి ధనార్జన, స్వేచ్ఛా జీవితం, శరీరాశల ముందు మాయమైపోయింది.

విశ్వాసులలో ఇలాంటి వారు ఉన్నారా అని ప్రశ్నించుకుంటే, పిల్లల్ని పట్టించుకోని తల్లి దండ్రులు, వారి ఉద్యోగాలు, ధనార్జనే వారికి ప్రాధాన్యం అనుకునే తల్లిదండ్రులు, భార్యను, పిల్లల ను పట్టించుకోకుండా పరిచర్య పేరుతో విద్యుక్త ధర్మాన్ని విడచి పెట్టే విశ్వాసులు కూడా ఈ కేటగిరి

> **మనం నివసిస్తున్న ఈ విశ్వంలో దేవుడు సార్వభౌముడు, ఈ లోకంలో మనుష్యులు, వస్తువులు కూడా ఉంటాయి. మనము సార్వభౌముడైన దేవుని ఆరాధించబద్ధులము, వస్తువులను జ్ఞానయుక్తంగా విచక్షణతో వాడుకోవాలి. కాని ఎప్పుడైతే మనలను మనము, ధనాన్ని పూజించడం మొదలు పెడతామో దేవుని నిర్లక్ష్యపెడతాము, వస్తువులను ప్రేమిస్తాము, మనుష్యులను వాడుకోవడం అలవాటై పోతుంది.**

క్రిందకు వస్తారు. భార్యాభర్తల మధ్య ఉండవలసిన సహజప్రేమ లేని వారు మన గ్రాద్యుయేట్లలో లేరని చెప్పగలమా?

### 4. సజ్జన ద్వేషులు (Without love for what is good)

ఈ వ్యక్తులను వివరించుటకు గ్రంథకర్త వాడిన గ్రీకు పదము ఎఫిలో గథోస్ (Aphilogathos) అనగా మంచిని, మంచి మనుష్యులను తృణీకరించి వారి పట్ల క్రూరత్వముతో ప్రవర్తించేవారు. వీరు మంచిని సహించలేరు. అందరికి మంచి జరిగే విషయాలు వీరికి నచ్చవు. వీరికి మంచి సుగుణాల పైన మక్కువ వుండదు, తమను తాము ఎంత ప్రేమించు కుంటారంటే వారు దేనిని మంచి అనుకుంటారో అదే మంచి, తక్కినదంతా వారు ఇష్టపడని చెడుగా వారు చూస్తారు. ఇంకో విధంగా చెప్పాలంటే ప్రేమించవలసిన వాటిని, ఇష్టపడవలసిన వాటిని అసహ్యించుకుంటారు, అసహ్యించుకొనవలసిన వాటిని ప్రేమించడం వీరి సహజ లక్షణం. ఇలాంటి వారికి దేవుడు యెషయా 5:20లో ఇచ్చిన హెచ్చరిక, "కీడు మేలనియు, మేలు కీడనియు చెప్పుకొని చీకటి వెలు గనియు, వెలుగు చీకటనియు ఎంచుకొను వారికి శ్రమ. చేదు తీపి అనియు, తీపి చేదనియు ఎంచుకొను వారికి శ్రమ." వెలుగు లోకము లోనికి వచ్చెను కాని తమక్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ద్వేషించి చీకటిని ప్రేమించిరి. చీకటిని ప్రేమించు ప్రతివాడు వెలుగును ద్వేషించును (యోహాను 3:19,20).

ఈ సజ్జన ద్వేషులు మంచివారి పరిచయం

కలిగి ఉండడానికి గానీ, మంచి విషయాలు మాట్లాడడానికి గానీ ఇష్టపడరు. వారి దృక్పథమే వేరుగా ఉంటుంది. ప్రతివిషయాన్ని చెడు దృష్టితోనే చూస్తారు. వారికి మనుష్యులలోని మంచి చెడుగా కనిపిస్తుంది. మంచి సలహాను అంగీకరించరు. విశ్వాసి, లోకం ద్వారా ద్వేషించబడడానికి కారణం ఇదే! వారు నిర్హేతుకముగా మనలను ద్వేషిస్తారు. మన ప్రభువును శాస్త్రులు, పరిసయ్యులు ద్వేషించడానికి కారణం కూడా ఇదే!

ఇలాంటి వారు మన సహవాసాల్లో ఉంటే అంతకంటే ప్రమాదకర పరిస్థితి ఇంకొకటి వుండదు. వీరి వలన సహవాసాల్లో విభేదాలు వస్తాయి. వారి నిర్ణయాలు, ఆశయాలు సహవాసాన్ని తప్పుమార్గంలోకి నడిపిస్తాయి. వీరు దేవుని వాక్యాన్ని తమ జీవితాల్లోనికి అన్వయించుకొనకుండా ఇతరులను విమర్శిస్తారు.

**5. దేవుని కంటే సుఖానుభవాన్ని ఎక్కువగా ప్రేమించు వారు** (Lovers of pleasure rather than God)


సుఖానుభవాన్ని ఎక్కువగా ప్రేమించేవారు అనే పదానికి గ్రీకు భాషలో వాడిన మాట ఫిలెడోనోస్ (Philedonos). ఈ గ్రీకు పదం రెండు పదముల కలయిక వలన ఏర్పడింది. ఫిలోస్ (Philos) అనగా స్నేహితుడు, హెడోన్ (Hedone) అనగా సుఖభోగాలు, ఈ Hedone అనే పదం నుంచి హెడోనిజమ్ (Hedonism) అనే ఇంగ్లీషు పదం ఏర్పడింది. హెడోనిజమ్ అంటే జీవితంలో ఒక వ్యక్తి పొందగలిగిన అత్యధిక మేలు 'సుఖభోగాలే' అని నమ్మే ఒక సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని నమ్మేవారు సుఖభోగాలతో మునిగి తేలుతుంటారు. పాపసంబంధమైన కోర్కెలు తీర్చుకొంటూ భోగలాలసులుగా జీవితాన్ని గడిపే ధనికులు వీరు. వీరి దేవుడు 'సుఖము'. వీరు ఈ భోగాలకోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడతారు. వీరి జీవితంలో స్వీయ కోరికలు తృప్తి పరచుకోవడమే ప్రధాన గమ్యం కావడానికి కారణం, వీరు తమను తాము అమితంగా ప్రేమించుకోవడమే! "వెలుగు లోకములోనికి వచ్చెను కాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమించక చీకటినే ప్రేమించిరి" (యోహాను 3:19) అని రాయబడింది వీరికోసమే!



ఈ లక్షణం కేవలం లోకస్తులలోనే ఉందనుకోవడం పొరబాటు. ఇది క్రైస్తవ్యంలోకి వ్యాపించిన దుర్భోధ. విశ్వాసులు దేవుని పిల్లలు కాబట్టి వారికి కష్టాలు, బీదతనం, రోగాలు రాకూడదు, వారి జీవితం సుఖ సౌఖ్యాలతో నిండి ఉండాలని బోధించే వారెందరో. క్రొత్త నిబంధనలో ఆశీర్వాదాలు భౌతికం కాదని, వాగ్దానాలు షరతులతో కూడినవని, శ్రమ తర్వాత మహిమ వుందని నమ్మే విశ్వాసులు తగ్గిపోతున్నారు. ప్రభువు నేర్పిన మితానుభవము గల జీవితాలు విశ్వాసులలో కరువైపోతున్నాయి. ఆడంబరాలతో పెళ్ళిళ్ళు, ప్రధాన కార్యక్రమాలు, పుట్టిన రోజు సంబరాలు విశ్వాసులకు మామూలై పోయాయి. వస్తు, వాహన, సామగ్రి కలిగి వుండడం ఒక అంతస్తుకు సూచనగా వుంటుంది (మెటీరియలిజమ్). ఎక్కడ చూచినా తినడానికి, త్రాగడానికి ఎన్నో ఫుడ్ కోర్టులు, ఖరీదైన విహారయాత్రలు, విలాసయాత్రలు సాధారణమైపోయిన రోజుల్లో ఉన్న మన జీవితాలలో దేవుని పరిచర్య, మిషనరీ సేవ, బీద విద్యార్థులు, అనాధలను, అభాగ్యులను, బీద విధవరాండ్రను పరామర్శించే ప్రేమమూర్తులు ఎందరు?

విశ్వాసజీవితంలో శ్రమ, త్యాగం, ఇవ్వడం, మితముగా వుండడం, సహించుకోవడం, తగ్గించుకోవడం, మొదలగు ప్రభువు లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపించాలి. అహం లేక స్వార్థం నుండి ఉత్పత్తి అయ్యే ఈ పాపాల ద్వారా పరిపాలించబడడానికి నీవు నేను అంగీకరించడానికి వీలులేదు. దేవుని పోలి నడుచుకొనుటకు పిలువబడి, లోకంతో రాజీపడకుండా, దిన దినం పాత స్వభావానికి చనిపోతూ మూర్ఖమైన వక్రజనము మధ్య నిష్కలంకులుగు దేవుని కుమారులు కుమార్తెలుగా జీవవాక్యాన్ని చేత పట్టుకొని జ్యోతుల్లాగా ముందుకు సాగిపోదాం. ప్రభువు రాజ్యంలో ఆయనతో మహిమలో పాలు పుచ్చుకుందాం. మరనాత!

**– కె. దేవిడ్ రాజ్‌కుమార్,** గుంటూరు



# అంత్యదినాల్లో అవలక్షణాలు

ఒకసారి మాజీ యుఇయస్ఐ నేషనల్ స్టాఫ్ పిసి వర్గీస్ గారిని అడిగా. మీరు 15 రోజులు మినిస్ట్రీ పరంగా బయటే ఉంటారు, ఇంటిని, పరిచర్యని ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారని. ఆయన నవ్వి అన్నారు, "నేను ఇంటిలో ఉన్నంత సేపు మొత్తం పనులన్నీ నేనే చేస్తాను, పిల్లలని భార్యని కూర్చోపెట్టి ఆ 15 రోజులలో జరిగిన విషయాలు, ప్రార్థనాంశాలు చెబుతా. వాళ్ళని మినిస్ట్రీలో భాగస్వాములను చేస్తా. ప్రార్థనా జవాబులు పొందినప్పుడు వాళ్ళ సంతోషం, దేవునిలో వాళ్ళ విశ్వాసం పెరుగుతుంది.

మన పూర్వీకులు, పయనీర్స్, రోల్‌మోడల్స్‌తో మాట్లాడుతుంటే మనకు ఎన్నో విషయాలు ఆదర్శంగా ఉంటాయి. దేవుని కొరకు వాళ్ళు పడ్డ శ్రమలన్నీ సంతోషంగా స్వీకరించారు. నేటి దినాల్లో మాదిరి గల విశ్వాసులు, నాయకులు కొరవడుతున్నారు.

అపొస్తలుడైన పౌలు భక్తుడు 2 తిమోతి 3:1-4 వచనాల్లో అంత్యదినాల్లో ప్రజల యొక్క లక్షణాలు ఎలా ఉంటాయో చెప్పాడు. అవి మనలో ఉండకూడని లక్షణాలు. మన సహోదరులలో ఉంటే దు:ఖపడాల్సిన లక్షణాలు. సంఘంలో చీడపురుగుల్లా ఉండి, సంఘాన్ని నాశనం చేసే వ్యక్తుల లక్షణాలు. ఈ లోకానికి క్రైస్తవ్యాన్ని తప్పుగా చూపించే వ్యక్తుల వలన సంఘం, సంస్థలు, సమాజం నష్టపోతాయి. దేవుని నామానికి అవమానం తెచ్చే ప్రజలుగా ఉంటారు. అంటువంటి లక్షణాలు గల వ్యక్తులు మన సహవాసంలో ఉండకూడదని మరి ముఖ్యంగా అటువంటి లక్షణాలు మనలో ఉండకూడదని ప్రార్థన చేసుకొందాం.

### 1. బింకములాడు వారు

కొంతమంది తమ గురించి గొప్పలు చెప్పుకొనే వారుంటారు. వారు ఎంత సేపూ వారిని గౌరవించాలని, వారిని మెచ్చుకోవాలని అనుకొంటారు. వారి కంటే చేతనైనవారు లేరన్న భావనలో ఉంటారు.

దేవుని వాక్యం స్పష్టంగా చెబుతుంది. 'రేపటిని గూర్చి అతిశయపడకుము ఏ దినమున ఏది జరుగునో నీకు తెలియదు. నీ నోరు కాదు అన్యుడే, నీ పెదవులు కాదు పరులే నిన్ను పొగడవలెను' (సామె 27:1,2). దేవుడు గొప్ప సత్యాలను తన గ్రంథంలో మనకు కనువిప్పు కలగడానికి ఉంచాడు. 'సాతాను తన జీవితంలో అహంకారంతో ఆలోచించి దేవునికి పైగా నా సింహాసనమును హెచ్చింతుననుకొని పాతాళంలో ఒక మూలకి తోయబడ్డాడు' (యెషయా 14:12-15). పరిసయ్యుడు, సుంకరి ప్రార్థనలో, పరిసయ్యుడు చేసిన ప్రార్థనలో తన్ను తాను హెచ్చించుకొన్నాడు. అతని ప్రార్థనలో అబద్ధాల కన్నా అతిశయం ఉంది. ప్రతి దానిలో దశమభాగం, వారానికి రెండు సార్లు ఉపవాసం, చోరులు, అన్యాయస్థులు, వ్యభిచారులవలె గాక, అన్న మాటలు ఈ సుంకరివలె గాక ...తన్ను తాను ఎంతగా హెచ్చించుకొంటున్నాడో అర్థం అవుతుంది.

సుంకరి అయితే గుండెలు బాదుకొని, ఆకాశంవైపు కన్నులెత్తే ధైర్యంలేక 'దేవా పాపినైన నన్ను కరుణించు' అన్న ప్రార్థనకు పరిసయ్యునికంటే, సుంకరి నీతిమంతునిగా తీర్చబడ్డాడని యేసుప్రభువు చెప్పాడు.

తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గించబడును, తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును (లూకా 18:10-14).

ఇది మన జీవిత విధానంలో దిక్సూచి అవ్వాలి. గొప్పలు చెప్పుకొనే స్వభావాన్ని తగ్గించుకోవాలి. సర్వసృష్టిని సృష్టించిన యేసయ్య పాదాలు కడిగాడే, ఆ తగ్గింపును అలవర్చుకోవాలి. యేసయ్య చూపిన ప్రేమను, సాత్వీకాన్ని మన జీవితాలలో చూపించాల న్న నిర్ణయం తీసుకోవాలి.

అనేకమంది యొక్క త్యాగ ఫలితం మన యుఇయస్ఐ. దాని ఫలాలను అందుకొనేటప్పుడు దానికి లెక్క మనం అప్పజెప్పాలన్న భావన ఉండాలి.

కులం గొప్ప, ఆర్థికంగా ధనిక-పేద, పార్టీతత్వం ఇవన్నీ అహంకారానికి, అతిశయానికి కారణం. అవి దేవునికి ఇష్టంలేనివి. మన మధ్య అటువంటి విభేదాలను సృష్టించేవారు, దేవునికి వ్యతిరేకమైన కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని గమనించాలి.

మనం ఒక కుటుంబంగా ప్రేమ, అనురాగాలతో దేవుని కొరకు కలిసి పనిచేయాలన్న భావన పెరగాల్సిన అవసరత ఎంతో ఉన్న రోజులివి. సాతాను బలంగా మన సంస్థలను అడ్డగిస్తున్న సమయంలో మన ఐక్యత, తగ్గింపు మనకు విజయాన్నిస్తాయి.

## 2. గర్విష్టులు, అహంకారులు

నాశనానికి ముందు గర్వం నడచును. ఇది దేవుని వాక్యం ఇచ్చే గొప్ప హెచ్చరిక. పరిచర్యలో ఉండకూడనిది గర్వం, అహంకారం. గర్విష్టుల నైనను, త్రోవ విడచి అబద్ధముల తట్టు తిరుగు వారి నైనను లక్ష్యపెట్టక, యెహోవాను నమ్ముకొనువాడు ధన్యుడు (కీర్తన 40:4) అని దేవుని వాక్యం స్పష్టంగా తెలియజేస్తుంది. గర్విష్టులను దేవుడు గద్దిస్తాడు. ఆయన ఆజ్ఞలను విడచి తిరిగేవారు శాపగ్రస్తులు.

గర్వానికి, అహంకారానికి తావులేని పరిచర్యలో మనం ఉన్నాం. అన్నీ ఉన్నా, పేదరికాన్ని, కష్టాల ను అంగీకరించి పరిచర్య చేసిన పూర్వీకులు మన ముందున్నారు. ప్రొ.ఇనాక్, డా. స్టెరెట్, డా. మూడీ... ఇలా అనేకులు మనకన్నా ఉన్నత స్థితిలో ఉన్నవారు. గర్వానికి తావులేని జీవితం మన ముందుంచారు.

గర్వించడానికి మనకేముంది. మన కాలగతులు దేవుని చేతిలో ఉన్నాయి. ఏ రోజు తుది రోజో మనకు తెలియదు. అహంకారం, గర్వం ఉంటే విడచిపెడదాం. దీన మనస్సుతో పరిచర్యలో ఉందాం. దేవుని యందలి భయం మనల్ని గర్వం నుండి, అహంకారం నుండి విడుదల చేస్తుంది.

## 3. దూషకులు

పౌలు తాను దూషకుడను, హింసకుడను, హానికరుడనై యున్నానని చెబుతూ, యేసుప్రభువు తనని పరచర్యకు నియమించి, నమ్మకమైన వానిగా తనను ఎంచినందుకు ప్రభువుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాడు. తెలియక అవిశ్వాసము వలన చేసితిని గనుక, కనికరించబడితిని. దూషకునిగా ఉండడానికి మనకు హక్కులేదు, అది దేవునికి ఇష్టంలేని పని. దేవుని ఎరుగుదుమని చెబుతూ, అసహ్యులు, అవిధేయులు ప్రతి సత్కార్యము విషయంలో భ్రష్టులైయుండి తమ క్రియలవలన ఆయనను ఎరుగమన్నట్టున్నారు (తీతు 1:16).

మన మాటలు ఎంతో మృదువుగా ఉన్నట్లు కనబడుతూ, హృదయమంతా దుష్ట తలంపులతో నిండి ఉండడం అనేది దేవుని హృదయాన్ని గాయపరచడమే. ఇతరుల గురించి చెడ్డమాటలు, తోటి సహోదరులపై కొండెములు, వారి యొక్క వ్యక్తిత్వాన్ని అన్యాయంగా నాశనం చేయడం, ఇవన్నీ దేవునికి వ్యతిరేకం. దురద చెవులు గలిగినవారు ఇటువంటి సంభాషణ ఆనందిస్తారు. దేవుని చిత్త ప్రకారం దేవుని సేవ చేద్దాం అనుకొన్నవారు ఇటువంటి వ్యర్థంగా మాట్లాడే మాటలకు సమయం కేటాయించరు. దురద చెవులు ఉన్నవారు, దుష్టపు మాటలు మాట్లాడేవారు ఉంటారు. వీరి నుండి మనల్ని మనం జాగ్రత్తగా కాపాడుకోవాలి.

## 4. తల్లిదండ్రులకు అవిధేయులు

మీరు దీర్ఘాయుష్మంతులగునట్లు మీ తల్లిని తండ్రిని సన్మానించుము (నిర్గమ 20:12). ఇది దేవుడిచ్చిన

ఆజ్ఞ. కుటుంబాలలో పిల్లలు తల్లిదండ్రులతో ఉన్నప్పుడు వాళ్ళను గౌరవించి వాళ్ళ సలహాలు పాటించాలి. దేవునికి వ్యతిరేకం కానివి ఏవైనా సరే శిరసావహించడం మంచి పద్ధతి. తల్లిదండ్రులు వారి బిడ్డలు అందరికంటే దేవున్ని ఎక్కువగా ప్రేమించే వారిగా పెంచాలి. అలా పెరిగిన పిల్లలను చూచి ఆనందించాలి.

పెళ్ళి కావల్సిన మగ పిల్లల విషయంలో తల్లిదండ్రులు కట్నం, కులం, అందం, చదువు, వెనక వచ్చే ఆస్తుల గురించి ఎక్కువ ఆసక్తి చూపేవాళ్ళుగా ఉంటున్నారు. దేవుని చిత్త ప్రకారం వివాహం చేసుకోవాలనే అనే ఆలోచన తగ్గిపోతున్న రోజులివి. దేవుని చిత్తం అనేది అన్నిటికన్నా ప్రాముఖ్యం అన్న అవగాహన తల్లిదండ్రులకు తేవలసిన బాధ్యత ప్రభువును నమ్మిన బిడ్డలపై ఉంది. ప్రేమతో సత్యం చెబుతూ, మన జీవితాల ద్వారా దేవునికి నమ్మకస్తుల మై ఉన్నామన్న విషయం చూపడం, వేషధారులుగా జీవించకుండా ఉండడం, ఇవన్నీ యౌవనస్తులైన ఇజియఫ్ మెంబర్స్ బాధ్యత.


తల్లిదండ్రులను సన్మానించాలి అన్నది ఆజ్ఞ. దీని దగ్గర చాలా గొడవలు వస్తాయి. అబ్బాయి యొక్క తల్లిదండ్రులను సన్మానించాలన్న భావనలో ఉంటారు. సమస్యలు తగ్గాలంటే.. భర్త - భార్య తల్లిదండ్రుల ను సన్మానించాలి. భార్య - భర్త తల్లిదండ్రులను సన్మానించాలి. తల్లిదండ్రులకు పిల్లలు అవిధేయులు గా ఉండకూడదు. వారిని ప్రేమించాలి, వారి అవసరాలు తీర్చాలి.

### తల్లిదండ్రుల బాధ్యత

తల్లిదండ్రులు పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను, బోధలోను వారిని పెంచాలి (ఎఫెసీ 6:4). బాలుడు నడువ వలసిన త్రోవను వానికి నేర్పుము, వాడు పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడు (సామె 22:6). తల్లిదండ్రులు దేవుని వాక్యం హృదయంలో ఉంచుకొని పిల్లలకు అన్నివేళలా నేర్పించాలి. పిల్లలను దేవునిపై ఆధారపడే వ్యక్తులుగా పెంచడం తల్లిదండ్రుల బాధ్యత. ఇవి జరిగినప్పుడు, ఒక చక్కని క్రైస్తవ కుటుంబం ఏర్పడుతుంది.

## 5. కృతజ్ఞత లేనివారు

- ❖ కృతజ్ఞత చెల్లించడం మన విధి (1 థెస్స 2:13).
- ❖ కృతజ్ఞత చెల్లించడం దేవుని చిత్తం (1 థెస్స 5:16)
- ❖ కృతజ్ఞత చెల్లించడం దేవుని కిష్టం



ఒకసారి యేసుప్రభువు వస్తూవుంటే దూరంగా కుష్టురోగులు నిలబడి కనికరించమని బ్రతిమ లాడారు. యేసు వారిని యాజకులకు కనబరచు కొమ్మన్నాడు. యాజకుడు కుష్టు తగ్గిందని చెబితే గాని వారు సమాజంలో సంచరించకూడదు. వారు దారిలో స్వస్థపరచబడ్డారు. ఒక్క కుష్టురోగి వెనుకకు వచ్చి సాష్టాంగపడి యేసయ్యకు కృతజ్ఞత తెలియబరచాడు. యేసు అన్నాడు, 'మిగిలిన తొమ్మండుగురు ఎక్కడ? (లూకా 17:11-19).

దావీదు నా అంతరంగమునను్న సమస్తమా ఆయన నామమును సన్నుతించుము అంటాడు (కీర్తన 103:1). మన జీవితంలో మేలు చేసిన వారిపట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. దేవునికి మనం కృతజ్ఞత చెల్లించాలి. కృతజ్ఞత లేని వారిని పరిశుద్ధ గ్రంథము నీతిమంతుడిగా ఎంచదు. 'నిశ్చయముగా నీతిమంతులు నీ నామమునకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదరు (కీర్తన 140:13). కృతజ్ఞత అనేది దేవుని లక్షణం, మనం కలిగి ఉందాం.

### ముగింపు

పౌలు భక్తుడు, భయముతోను, వణకుతోను మన సొంత రక్షణను కొనసాగించుకోమంటాడు (ఫిలిప్పీ 2:12). మనం అహంకారానికి, గర్వానికి, చెడ్డమాటలు మాట్లాడడానికి, గొప్పలు చెప్పే నైజానికి స్వస్తి చెప్పాలి. ఎందుకంటే అవన్నీ సాతాను రాజ్యానికి సంబంధించినవి. దావీదు చేసిన ప్రార్థన మనం చేసి మన జీవితాన్ని పరిశుద్ధంగా ఉంచుకోవాలి. "దేవా నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము, నన్ను పరీక్షించి నా ఆలోచనల ను తెలిసికొనుము. నీకాయాసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము. నిత్య మార్గమున నన్ను నడిపించుము (కీర్త 139:23,24).

**- యం. జయనేంద్రకుమార్,** గుడివాడ



ప్రత్యేకం

### అంత్య దినాల్లో మన జీవితం, పరిచర్య

# క్రీస్తును పోలి ఉండాలి

నేడు మన చుట్టూ ఉన్నది రంగుల ప్రపంచం. ఎన్నో ఆకర్షణలు, వింతలు, విపరీత ధోరణులు. అదేమంటే ఇది ఏఐ యుగం, ఏదైనా సాధ్యమే అంటున్నారు. విశ్వాసులుగా మనము కూడా ఈ ఆకర్షణలకు విపరీత ధోరణులకు ప్రభావితం అవుతున్నాం. ట్రెండీగా ఉండాలని, అందరూ చేస్తున్నారు కాబట్టి మనం కూడా చేయాలని అనుకుంటున్నాము. వీటివల్ల మన వ్యక్తిగత జీవితంలోను, పరిచర్యలోను దేవుని దృష్టికి సరికానివి చొరబడి నష్టాన్ని కలిగిస్తున్నాయి. అందుకే పౌలు తిమోతికి రాస్తూ అంత్య దినాల్లో మనుషులు ఎలా ఉంటారో చెప్పి అలాంటి వారి పట్ల విముఖుడవై యుండు అని చెప్పాడు. పౌలు చెప్పినట్లు మన చుట్టూ ఉన్న సమాజంలో అంత్య దినాల్లో మనుష్యులు ఎలా ఉంటారో అలాంటి వారి పట్ల మనం ఎలా ఉండాలో 2 తిమోతి 3:1-5 వచనాలను ఆధారం చేసుకొని కొన్నిటిని చర్చిద్దాం.

**అపవిత్రులు**

పవిత్రమైన విషయాల పట్ల నిర్లక్ష్యం చూపిస్తూ, చెడు లేక మంచివి కాని వాటిని జరిగించే వారిని అపవిత్రులు అంటారు. బైబిల్ ప్రకారం దేవుడు చేయమన్న మంచి చేయక దేవుడు చేయవద్దు అన్న చెడు చేసేవారు అపవిత్రులు. నేటి దినాల్లో మనుష్యులు దేవునికి వ్యతిరేకమైన వైఖరి, ఆలోచన, క్రియలు కలిగి ఉన్నారు. చెడు స్నేహాలు, వివాహపూర్వపు లైంగిక సంబంధాలు, హింస, పోర్నోగ్రఫీ, వివాహేతర సంబంధాలు, చెడు చేసే వారితో పొత్తు, సహజీవనం, డ్రగ్స్, లంచగొండితనము, చెడ్డ ఆచారాలు, సాంఘిక దురాచారాలను చేయడం, ప్రోత్సహించడం, విపరీతమైన ధోరణులు, చెడ్డ కోరికలు మొదలగునవి అపవిత్రమైన కార్యములు. ఇవన్నీ చెడు స్వభావం కలిగిన మానవ హృదయంలో నుండి వచ్చి మనుష్యులను అపవిత్రులుగా చేయుచున్నవి అని బైబిల్ చెబుతుంది (మార్కు 7:21-23). ఇలాంటి అపవిత్ర కార్యాలను జరిగించేవారు దేవుని శిక్షకు లోనవుతారు (రోమా 1:18) వీరు రెండవ మరణమైన నరకాగ్నికి పాత్రులు.

అయితే అంత్యకాలంలో ఇలాంటివి జరిగించే వారి మధ్య జీవిస్తున్న విశ్వాసులమైన మనము అపవిత్రతకు దూరంగా ఉండాలి. ఎందుకంటే దేవుడు మనలను పరిశుద్ధులుగా ఉండుటకే పిలిచాడు గానీ అపవిత్రులుగా ఉండుటకు పిలువలేదు (1 థెస్సలో 4:7). ఈ అపవిత్రతను చంపివేయాలి (కొలస్సీ 3:5). అపవిత్రత అనేది విశ్వాసులకు తగినది కాదు (ఎఫెస్సీ 4:19). అపవిత్రతను జరిగించడం అంటే పరిశుద్ధ దేవునికి వ్యతిరేకంగా చేసే ఘోర దుష్కార్యము అని మొదట గ్రహించాలి (ఆది 39:9). అపవిత్రత దేవుని నామానికి అవమానం తెస్తుందని, విశ్వాస జీవితాల్లో సిగ్గును దు:ఖాన్ని కలిగిస్తుందని గుర్తించాలి. అంతిమంగా దేవుని క్రమశిక్షణకు లేక శిక్షకు గురి అవుతామని ఎరిగి అపవిత్రంగా జీవించడానికి

భయపడాలి. దేవుని ఎరిగిన విశ్వాస విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్స్‌గా పవిత్రమైన వాటి యందు మనసు ఉంచాలి (ఫిలిప్పి 4:18). ఈ లోక మర్యాదను అనుసరింపక దేవుని చిత్తానుసారంగా పవిత్రుల ుగా ఉండుటకు సజీవ యాగముగా ప్రతిదినము ఆయనకు అప్పగించుకోవాలి (రోమా 12:1). ప్రతి రోజు అర్థవంతమైన మౌన ధ్యాన సమయం, ప్రార్థనా జీవితం కలిగి ఉండాలి. పరిశుద్ధముగా జీవించుట వలన మనము దేవునిలో ఎదుగుతాము, బహుమానం పొందుతామని ఎరిగి పవిత్రంగా జీవించాలి (మత్తయి 5:8). తోటివారికి పవిత్రతలో మాదిరిగా ఉండాలి (1తిమోతి 4:12).

## అతిద్వేషులు

తప్పు చేసిన వారిని క్షమించలేని స్వభావంగల వారు, తప్పు చేసి క్షమాపణ అడగడానికి సిద్ధంగా ఉండనివారు, గొడవలు లేక భేదాభిప్రాయాలను పరిష్కరించుకోలేనివారు, ఇతరులపై తీరని పగ లేక ద్వేషం కలిగినవారు, తోటి మానవులతో సమన్వయంతో జీవించలేనివారు, ఇతరులతో సరి చేసుకోలేని సమస్యలు లేక తగాదాలు కలవారిని అతి ద్వేషులు అంటారు.

ఇది బైబిల్‌లోని ఆదికాండగ్రంథంలో లోకములోనికి పాపం ప్రవేశించిన తర్వాత ఆదాము కుమారుడైన కయీను తన సహోదరుడైన హేబేలుతో సమన్వయంతో జీవించలేక, పగ పెంచుకొని అతనిని చంపాడు. మానవులలో ఈ ద్వేషించడం అనేది దేవునికి అవిధేయత చూపడం, తిరుగుబాటు చేయడం, తిరస్కారం చేయడం యొక్క ఫలితమే. అప్పటి నుండి ఇది భూమిపై మనుష్యులు అందరిలో వ్యాపించినది.

నేటి సమాజంలో ఇలాంటి ద్వేషం, పగ, ఇతరులు తప్పు చేసినప్పుడు క్షమించలేకపోవడం అనేది అనైక్యత, హింసకు, చంపుకోవడానికి కారణం అయింది. మతాలు, జాతులు, రాజకీయ పార్టీలు, దేశాల మధ్య ఈ ద్వేషము ఎక్కువై హింస, మతకలహాలకు కారణమవుతున్నాయి. ద్వేషాన్ని రెచ్చగొట్టే మాటలు, పనులు కొందరు చేస్తున్నారు. తద్వారా భిన్నత్వంలో ఏకత్వం గల దేశంలో ఒకరికి మధ్య మరొకరికి సమన్వయం లేకుండా చేస్తున్నారు. తోటి మానవులు తప్పు చేస్తే క్షమించలేక పగ పెంచుకుంటున్నారు.



అయితే ఇలాంటి అతిద్వేషుల మధ్య నివసించే మనం ద్వేషం లేకుండా దేవుడు చెప్పినట్లు జీవించాలి. క్రైస్తవేతరులైన మన స్నేహితులు, సహోద్యోగులతో ప్రేమ కలిగి ఉండాలి. బైబిల్ అందుకే శక్యమైతే మనుష్యులందరితో సమాధానంగా ఉండమని చెబుతుంది (రోమా 12:18). కొన్నిసార్లు యేసుక్రీస్తును బట్టి వారు మనలను నిందించి, హింసించినా మనము వారిని క్షమించి ప్రార్థించాలే కానీ ద్వేషించరాదు. అలెగ్జాండర్ పోప్ "తప్పు చేయడం మానవ నైజం, క్షమించడం దేవుని నైజం" అని అన్నాడు. దైవిక స్వభావం క్షమించడం అనేదాన్ని మనం కూడా అలవర్చుకోవాలి. సహవాసంలో కూడా తోటి సహోదరులపై పగ, ద్వేషం పెంచుకోకూడదు. ఏవైనా అభిప్రాయ భేదాలు, సమస్యలు, గొడవలు, తలెత్తినప్పుడు సామరస్యంగా, వాక్యానుసారంగా పరిష్కరించుకోవాలే తప్ప ద్వేషాన్ని పెంచుకోకూడదు. మనకు హాని చేసిన వారిని ప్రభువు మనలను క్షమించినట్లు మనము వారిని క్షమించ బద్ధులమై యున్నాము (కొలస్సీ 3:13). మనం సహవాసంలో కలహాలు, భేదాలకు కారణం కారాదు. ద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించరాదు. ఇతరుల పట్ల దయగలిగి ఉండడం, క్షమించడం అనేవి యేసుక్రీస్తు మనకు నేర్పిన సుగుణాలు. ఒకరినొకరు ప్రేమించుకొనవలెనని దేవుడు మనకు ఆజ్ఞ ఇచ్చాడు.

## అపవాదకులు

ఇతరుల వ్యక్తిత్వానికి నష్టం కలిగించే విధంగా మాట్లాడేవారు, ఒకరి గురించి తప్పుగా మాట్లాడడం ద్వారా వారి ప్రతిష్టను దెబ్బ తీసేవారు, చాడీలు చెప్పడం, ఇతరులపై అపనిందలు లేక అభాండాలు



వేయడం, కొండెములు మాట్లాడడం, దూషించడం, అసభ్యకరమైన వార్తలు ఇతరుల గూర్చి రాయడం, ఇతరులను గూర్చి తప్పుడు నివేదికలు ఇవ్వడం చేసేవారే అపవాదకులు.

నేటి ఆధునిక ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా మార్ఫింగ్ చేసిన ఫోటోలతో వ్యక్తిత్వాలను పాడు చేస్తున్నారు. లేని వాటిని ట్రోల్ చేస్తూ ఇతరులను బాధ పరుస్తున్నారు. లేని వాటిని పుట్టించి వాటిని వ్యాప్తి చెందిస్తున్నారు. అబద్ధాన్ని వ్యాప్తి చేయడం, ఇతరుల గూర్చి పై అధికారులకు చెడు, కొండెములు చెప్పి లబ్ధి పొందడం, యూట్యూబ్ లేక సోషల్ మీడియాలో దూషణ పోస్టులు పెట్టడం లాంటివి చేస్తున్నారు. ఎవరైనా అడిగినప్పుడు వారి గురించి తప్పుడు నివేదికలు ఇవ్వడం, తెలియని విషయాలు తెలిసినట్లు చెప్పడం అనేవి పరిపాటిగా మారిన సమాజంలో ఉన్నాము. అయితే ఇవి దేవునికి అసహ్యమైనవి (సామెతలు 6:19).

విశ్వాసులుగా మనం వీటికి వేరై ఉండాలి. మనము మాట్లాడు ప్రతి మాట తీర్పులోనికి తేబడుతుంది (మత్తయి 12:36,37) కొండెముల ను చెప్పేవారు భేదాలను కలుగజేస్తారు (సామెతలు 16:28) కొండెపు మాటలు మన్యుషుల మనసుల ను కలుషితం చేస్తాయి (సామెతలు 26:22). ఇతరులపై లేని వార్తలు పుట్టింపవద్దనేది దేవుని ఆజ్ఞ (నిర్గమ 23:1) ఈ అపవాదకుల వల్ల సంబంధాలు చెడిపోతాయి. ఇతరుల గౌరవానికి భంగం కలుగుతుంది. ఆత్మీయంగా నష్టం కలిగిస్తారు. అయితే విశ్వాసులంగా మనం వీటికి విముఖులమై ఉండాలి.

మనము మన పొరుగు వారితో సత్యమే మాట్లాడాలి (ఎఫెసీ 4:25;29) ఇతరులకు క్షేమాభివృద్ధిని కలుగజేసే విధంగా మాట్లాడాలి. బూతులు, పోకిరి మాటలు, చాడీలు చెప్పడం, తప్పుడు నివేదికలు ఇతరుల గురించి ఇవ్వడం చేయకూడదు. ఇతరులను బాధపరిచే విధంగా దూషించడం చేయరాదు. ఇతరుల గురించి మనకు తెలియని విషయాలను వ్యాప్తి చెందించకూడదు. సత్యమే మాట్లాడాలి. అవిశ్వాసులైన వారితో, సహవాసంలో తోటివారితో దయ కలిగి గౌరవప్రదంగా మాట్లాడడం నేర్చుకోవాలి.

## అజితేంద్రియులు

తమను అదుపులో పెట్టుకోలేనివారు, స్వీయ నియంత్రణ లేనివారు, ఆవేశపరులు, దూకుడు ప్రవర్తన గలవారు, ఆలోచించకుండా నిర్ణయాలు చేసే వారిని అజితేంద్రియులు అంటారు. వీరు స్వీయ నియంత్రణ లేని వ్యక్తులు కాబట్టి హఠాత్తుగా వారి ప్రవర్తనలో మార్పు కనిపిస్తుంది. వారు భావోద్వేగాలకు లోనవుతారు. కొన్నిసార్లు వారు తమ లేదా ఇతరులకు హాని కలిగించే నిర్ణయాలు లేక ఎంపికలు చేస్తారు. క్షణికావేశంలో నిర్ణయాలు చేయడం మరియు ప్రతిస్పందించడం చేస్తారు. దీని వల్ల వారు చాలా బలహీనమైన వారుగా ఉంటారు.

నేటి దినాల్లో ప్రజలు శారీరక మానసిక భావోద్రేక విషయాల్లో తమను తాము నియంత్రించుకోలేక పోతున్నారు. శరీర విషయంలో అతిగా తినడం వల్ల కలిగే ఊబకాయం, అతినిద్ర లేదా ఆలస్యంగా నిద్రపోవడం తద్వారా శరీరంలో అనా రోగ్యాలు, లైంగిక నియంత్రణ లోపించడం వల్ల చెడు అలవాట్లకు లోనవడం, మానసికంగా స్థిరంగా లేకపోవడం వల్ల క్షణికావేశంలో జరిగే హత్యలు, ఆత్మహత్యలు, ఏది మంచిదో ఆలోచించకుండా నిర్ణయాలు చేయడం తద్వారా వాటి పర్యవసానాలకు బాధపడడం వంటివి చూస్తున్నాం. నేటి దినాల్లో చాలామంది విద్యార్థులు మానసికంగా బలహీనులుగా ఉన్నారు. కొంతమంది వయసులో పెద్దవారు, విద్యావంతులైనవారు భావోద్రేగాల విషయంలో బలహీనంగా ఉన్నారు. వీరు తమ కోరికల చేత భావోద్రేకాల చేత నడిపించబడతారు. బలహీన భావోద్వేకాలు గల వారు త్వరగా కోపపడడం, దు:ఖం, కృంగుబాటు లాంటి వాటిని కనబరుస్తారు.

అయితే దేవుడు మనకు ఇంద్రియ నిగ్రహము కలిగిన ఆత్మను అనుగ్రహించారు (2 తిమోతి 1:7)

ఇలాంటి స్వీయనిగ్రహము లేని వారి మధ్యలో పరిశుద్ధాత్మ దేవుని కలిగిన మనం ఆశానిగ్రహం కలిగి జీవించాలి. ఆశానిగ్రహం లేనివారు ప్రాకారం లేని పట్టణంలాగా భద్రత లేకుండా సాతాను దాడి చేయడానికి అవకాశాలు ఇచ్చిన వారవుతారు (సామె 25: 28). ఆశానిగ్రహము అనేది ఆత్మఫలం (గలతీ 5: 22, 23). మనం పరిశుద్ధాత్మ దేవునికి లోబడి జీవిస్తే ఆశానిగ్రహము కలిగి ఉండగలం. ఆశానిగ్రహము అనేది మనము దేవుడు కోరుకున్నట్లు జీవించడానికి, విశ్వాస జీవితంలో ఎదగడానికి, మంచి నిర్ణయాలు చేయడానికి దోహదపడుతుంది. మనం మన భావోద్రేకాలు, మన మాటలు, మనం చేసే పనుల విషయంలో యేసుక్రీస్తును ప్రతిబింబించాలి. యోసేపు బానిసగా అమ్మబడినప్పటికీ ఆశా నిగ్రహము కలిగి ఐగుప్తు దేశంలో తనను తాను కాపాడుకున్నాడు. అలాగే మనం కూడా శారీరక, మానసిక, భావోద్రేక, ఆత్మీయ విషయాలలో సంపూర్ణముగా ఆశానిగ్రహము ను కనపరచాలి.

## పైకి భక్తి గలవారైయుండి దాని శక్తిని ఆశ్రయించనివారు

పై రూపం చూస్తే భక్తి పరులుగా ఉంటారు కానీ భక్తికి కావలిసినవి వారి జీవితంలో కనిపించని వారు. వీరు మతం లేదా క్రైస్తవ ఆచారాలు బహిరంగంగా ప్రదర్శిస్తారు గాని నిజమైన క్రైస్తవ విశ్వాసం ఉండదు. ఎందుకంటే వీరు ఎన్నడూ వారి జీవితంలో దేవుని శక్తిని అనుభవించిన వారు కారు. అందుకే యేసుక్రీస్తు పరిసయ్యుల మతం, భక్తిని ఖండించాడు. వారి ఆచారాలు ప్రజలు వారిని భక్తిపరులని చెప్పుకోవాలని తప్ప అది నిజమైన భక్తి కాదు. ప్రజలకు కనబడాలని, వినబడాలనే వారి ప్రార్థన ఉపవాసం మరియు దానధర్మాలు ఉండేవి. ఇలాంటి వాటి వలన వారు పరలోకంలో ప్రవేశింపలేరని, వారు నడిపించేవారు కూడా పరలోకానికి వెళ్ళరని చెప్పాడు (మత్తయి 23: 15; మత్తయి 6:1- 18) దీనినే వేషధారణ అని కూడా చెప్పవచ్చు. అంతరంగంలో భక్తి లేకపోయినా పైకి భక్తి పరులుగా కనిపించడం. మతపరమైన ఆచారాలు కార్యక్రమాల్లో పాల్గొనడం. అంత్య దినాల్లో ప్రజలు మతపరమైన వ్యక్తులుగా కనబడడానికి ఇష్టపడతారు గాని దాని శక్తిని వారి జీవితాల్లో అనుభవించలేరు. అయితే మనము అలా ఉండరాదు, అర్థవంతమైన భక్తి జీవితం కలిగి ఉండాలి.

భక్తి అంటే క్రైస్తవ లేక మతపరమైన అలవాట్లు అనుసరించడం కాదు గాని దేవునితో వ్యక్తిగత సంబంధం కలిగి ఉండడం, ఆ సంబంధం వ్యక్తి జీవితంలో మార్పు తీసుకురావడం, భవిష్యత్తును గూర్చిన భరోసా లేక నిరీక్షణ కలిగించాలి. అయితే మనం క్రీస్తు ప్రభువులో ఇలాంటి అనుభవం కల వారము కాబట్టి మనం చేసేవి మనలో మార్పులు తీసుకురావాలే తప్ప అలవాటుగా చేయరాదు. మన మౌనధ్యాన సమయాలు జీవితంలో మార్పును తీసుకువచ్చే విధంగా ఉండాలే గాని అలవాటుగా ఉండరాదు. మన పిబియస్ దేవున్ని లోతుగా అర్థం చేసుకునే విధంగా ఉండాలే గాని ఇతరులకు బోధించడానికి మాత్రమే కాదు. మనము కార్యక్రమాలు, క్యాంపులు, కాన్ఫరెన్స్‌లకు హాజరవ్వడం భక్తిలో ఎదగడం అని తలంచరాదు. కానీ అవి ఎంత దేవునికి సన్నిహితంగా ఉండేటట్లు సహాయపడుచున్నాయి? ఎలాంటి మార్పు తెస్తున్నాయి? నిజమైన భక్తికి సంబంధించిన బల ప్రభావాలు మన జీవితంలో కనబడుతున్నాయా? జీవితంలో మార్పుని ప్రజలు చూస్తున్నారా? అనేది ముఖ్యం.

## ముగింపు

యేసుక్రీస్తు ప్రభువు భూమిపై దైవ మానవునిగా జీవించిన నాటి నుండి ఆయన రెండవ రాకడ వరకు అన్నీ అంత్య దినాలుగానే పరిగణించాలి. మనము ఈ అంత్య దినాలలో అపాయకరమైన సమయాలలో ఉన్నాము కాబట్టి పై విషయాల్లో మనం లోకం పోకడల కంటే దేవుని వాక్యానికే ప్రాధాన్యత నివ్వాలి. వాక్య ప్రకారమే జీవించాలి. వాటికి విముఖులమై ఉండాలి. యేసు క్రీస్తు ఈ లోకంలో ఉన్నప్పుడు ఈ లోక ఆకర్షణలకు లొంగక, లోకపోకడలను ప్రోత్సహించక వాక్యానుసారంగా జీవించారు. అలా జీవించాలని ప్రబోధించారు. అలాగే అంత్య దినాలలో మన జీవితం, పరిచర్య లోక ఆకర్షణ, పోకడలను అనుసరించి కాదు గాని యేసుక్రీస్తును పోలి ఉండాలి. అలా జీవించడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయం చేయును గాక.

– **ఆర్. రాజకుమార్,** స్టాఫ్, తిరుపతి

బైబిల్ స్టడీ

# పరిచర్య ప్రభువులా


(యోహాను 13:1-17)

## నేపథ్యం

వాస్తవానికి మనమందరం ఏదోవిధంగా నాయకులమే. మరి మన నాయకత్వానికి రోల్ మోడల్ ఎవరు? యేసుప్రభువే ఎప్పటికీ అంద రికీ గొప్ప నాయకత్వ రోల్ మోడల్. నాయకత్వం అంటే ఏంటో నిర్వచించటం మాత్రమేగాక మాదిరి చూపించి ఎలా బోధించాడో చూద్దాం.

## ప్రశ్నలు

1. యేసయ్య శిష్యులను ఎవరని అన్నాడు? ఎలాంటి గడియలో కూడా ప్రేమించాడు? ఎలా ప్రేమించాడు?
2. నాయకునికి, నడిపించే వారికి మధ్య సంబంధం, నాయకుడి ప్రేమను గూర్చి ఏమి నేర్చు కొంటాము?
3. ఏమి చేస్తాడో తెలిసి కూడా ఇస్కరియోతు యూదాను ప్రేమించాడా? నాయకుడు ప్రేమించేవారినే కాక, అపకారము చేసే వారిని ప్రేమించడం గూర్చి ఏం నేర్చుకొంటాము?
4. యేసుకు తన గురించి ఏమి తెలుసు? అయినా ఏమి చేశాడు?
5. యేసు "తన పై వస్త్రము పక్కనపెట్టి", "ఒక తువాలు నడుముకు కట్టుకొని" పనికి ఉపక్రమించుటలో ఏం అర్థమవుతుంది? నాయకుడు నేర్చుకోవలసిన పాఠం ఏమిటి?
6. 5వ వచనములో ఎవరు చేయవలసిన పని యేసుప్రభువు చేశాడు? నాయకుడు అంటే ఏ మని చూపించాడు? (వ.12-14). ప్రస్తుతం మనము అలాంటి నాయకులుగా ఉన్నామా?
7. యేసు చేస్తున్న దానికి పేతురు ఎందుకు అభ్యంతరం చెప్పాడు? యేసుప్రభువు ఏం చెప్పాడు? ఏం అర్థము చేసుకొంటాము?



8. 12-16 వచనాల ప్రకారం యేసు ఎలా బోధిం చారు? ఎలా మాదిరి చూపించారు? నాయకుడిగా ఏం నేర్చుకొంటాము?
9. వ.17 ప్రకారము నాయకుడు ఎప్పుడు ధన్యుడుగా ఉంటాడు?
10. నీ నాయకత్వపు శైలిని పరిశీలించుకో. ఎన్నిసార్లు సేవకునిలా, దాసుడు చేసే పనుల్ని చేయడానికి ముందుకు వస్తున్నాము?

ప్రభువులా నాయకుడు ప్రేమించాలి. చివరి వరకు ప్రేమించాలి. శత్రువులను, అపకారం చేసిన వారి ని ప్రేమించాలి. నాయకుని పరిచర్య ప్రేమ నుంచి రావాలి. నాయకుడు సేవకుడు అవ్వాలి. ప్రభువు సేవకనాయకత్వ ప్రిన్సిపుల్స్‌ను బోధించడమేగాక ఒక ప్యాట్రన్‌ను అమలు చేశారు. వాటిని ప్రాక్టీస్ చేసి చూపించారు. ప్రభువు చెప్పినట్లుగా ప్రభువులా బోధిస్తూ, ప్రవర్తిస్తూ, ప్రార్థిస్తూ, ప్రేమిస్తూ పరిచర్య చేస్తూ మాదిరి చూపుతూ ధన్యులుగా ఉండటానికి ప్రతిష్టించుకొందాము. ప్రార్థిద్దాం, ప్రయాసపడదాం, దేవున్నే మహిమపరుద్దాం.

– విజే డెస్క్



# ప్రేమ పూర్వక నాయకత్వం

*తండ్రి తన బిడ్డల యెడల నడుచుకొను రీతిగా మీలో ప్రతి వాని యెడల మేము నడుచుకుంటిమని మీకు తెలియును.*

– 1 థెస్స 2:11

ప్రభువైన యేసుక్రీస్తు వారి పరిశుద్ధ నామములో ప్రేమ పూర్వక వందనాలు తెలియజేస్తున్నాను. ఈ సహవాసంలోకి నేను ఎలా వచ్చానో ఆలోచిస్తూ ఉంటే నాకు నిజంగా ఆశ్చర్యమేస్తుంది. ఎందుకంటే మనం ఎక్కడి వారమో, ఏ తల్లి బిడ్డలమో, ఏమాత్రం రక్త సంబంధాలు లేకపోయినప్పటికిని అంతకంటే ఎక్కువగా క్రీస్తు రక్తం చేత మనమందరం ఒక కుటుంబంలో పాలి భాగస్తులయ్యాం.

పైన చెప్పబడిన వాక్య ప్రకారం పిల్లల పెంపకంలో విరామం లేని కృషి తల్లిదండ్రులకు ఉన్నట్లే, థెస్సలొనీకయ సంఘంలోని ప్రజల పట్ల పౌలుకున్న శ్రద్ధను వివరించడానికి సరిపోతుంది. అపోస్తలునిగా తనకున్న అధికారాన్ని నొక్కి చెప్పడానికి బదులుగా, వారి మధ్య తన సేవను చిన్నపిల్లలను చూసుకునే తల్లిదండ్రులతో పోల్చాడు. వారు దేవునికి తగినట్టుగా నడుచుకోవాలని హెచ్చరిస్తూ, ధైర్యపరచే ప్రయత్నాలను కొనసాగించేలా ప్రేరేపించింది. వారు అన్ని విషయాల్లో దేవుని ఘనపరచడం చూడాలనే "అపేక్ష" కలిగినవాడై ఉన్నాడు అని అనిపిస్తుంది.

మన సహవాసాలలో కూడా మనం పెట్టే పెట్టుబడి నిజంగా అభినందనీయం. అయితే ఒక విషయాన్ని మీ దృష్టికి తీసుకురావాలని అనుకుంటున్నాను. ఈమధ్య సోషల్ మీడియాలో 'ఒమేగా హాస్పిటల్స్ అధినేత కూతురు డ్రగ్స్‌లో పట్టుబడిందనే వార్త వచ్చింది. ఈ వార్తను చదువుతున్నప్పుడు మన కుటుంబంలో (సహవాసంలో) తల్లిదండ్రుల పాత్ర (గ్రాడ్యుయేట్స్) చాలా ఉంది. ఖర్చు పెడుతున్నాం. పనులు జరుగుతున్నాయి మంచిది. కానీ కుటుంబంలోని సభ్యులతో ప్రేమపూర్వకమైన సంభాషణ కొదువైతే భయంకరమైన పరిణామాలు కుటుంబాల్లో చోటు చేసుకుంటాయి. ప్రభువు చేసిన వన్ టు వన్ పరిచర్యను మన జ్ఞాపకం తెచ్చుకోవాలి. మనం ఈ సహవాసంలో "నమ్మకమైన గృహనిర్వాహకులం, ప్రేమించే తల్లులం, శ్రద్ధ వహించే తండ్రులం" అనే సంగతిని పదే పదే గుర్తుకు తెచ్చుకోవాలి.

మనం దేవునికి నమ్మకంగా లేకపోతే, మనం 'అతి ప్రేమగల తల్లులు', 'గారాబం చేసే తండ్రులు' అయ్యే అవకాశం ఉంది.

పిల్లలకు ప్రేమతో పాటు క్రమశిక్షణ కూడా అవసరం. నిజానికి క్రమశిక్షణ అనేది ప్రేమకు ఒక నిదర్శనం.

కాబట్టి ఈ సంవత్సర పరిచర్య ఆరంభంలోనే మన లోపాలను గమనిస్తూ, సరిచేసుకుంటూ, పరిచర్యలో ప్రేమపూర్వకమైనటువంటి నాయకత్వ బాధ్యతలు తీసుకోవలసిన అవసరం మనందరి మీద ఉంది.

ఎందుకంటే సమాజం చాలా విచ్ఛిన్నమైపోతుంది. మన పిల్లలు భ్రష్టులు కాకముందే వారిని ప్రభువు దగ్గరికి నడిపించవలసిన బాధ్యత మనందరిపై ఉంది. పిల్లలు ఎలా మాట్లాడాలో ఎలా నడవాలో నేర్పించవలసిన బాధ్యత మనపై ఉంది.

ఆఖరిగా ఈ సహవాసంలో మనం ఏం నేర్చుకున్నామో ఏం పొందుకున్నామో అది ఇతరులకు అందించడానికి మరి ఎక్కువగా కృషి చేద్దాం. ఈ మంద విషయంలో దేవుడు మనలో ప్రతి ఒక్కరిని లెక్క అడుగుతాడనే సంగతి గుర్తు పెట్టుకుందాం.

– **వి.జాషువ**, మొఘల్రాజపురం



# సెయింట్ ఆంబ్రోస్

## సంఘం యొక్క అతి ముఖ్యమైన ఫాదర్లలో ఒకరు

సంఘ చరిత్రలో గొప్ప పండితులు, పరిశుద్ధులు సెయింట్ ఆంబ్రోస్‌ను అత్యుత్తమ బోధకులలో ఒకరిగా భావిస్తారు. అయితే, ఈ సంఘ పితరునికి బోధించడంతో పాటు ఎన్నో మంచి లక్షణాలు ఉన్నాయి, అలాంటి నాయకుడు ఉండడం క్రైస్తవులకు ఆశీర్వాదం. మత స్వేచ్ఛ, తప్పుడు బోధను ఖండించడం, నైతికతపై ఆయన నాయకత్వం సంఘంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. మరొక ముఖ్యమైన సంఘ పితరుడైన సెయింట్ అగస్టీన్‌ను విశ్వాసంలోకి తీసుకురావడంలో కూడా ఆయన కీలక పాత్రను పోషించాడు. సెయింట్ అగస్టీన్ ఆయనను "చర్చికి నమ్మకమైన గురువుగా, తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా క్యాథలిక్ సత్యాన్ని నమ్మి నిలబడ్డాడని" చెబుతాడు. "ఆయన నైపుణ్యం, స్థిరత్వం, శ్రమలు, ప్రమాదాలు, ఆయన చేసిన, రాసిన దాని గురించి, రోమన్ ప్రపంచం సంకోచం లేకుండా ప్రకటిస్తుంది". సెయింట్ ఆంబ్రోస్ మరణ ఒత్తిడిలో కూడా తన విధుల నుండి, విశ్వాసం నుండి ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. ఆయనను తర్వాత కాలంలో 'డాక్టర్ ఆఫ్ ది ఫెయిత్, ఫాదర్ ఆఫ్ ది చర్చ్'గా గౌరవించినప్పటికీ, ఆయన చాలా అసాధారణమైన రీతిలో బిషప్‌గా ఎన్నిక చేయబడ్డాడు.

### ప్రారంభ నేపథ్యం

సెయింట్ ఆంబ్రోస్ క్రీ.శ. 340 ప్రాంతంలో చాలా సంపన్నమైన రోమన్ క్రైస్తవ కుటుంబంలో జన్మించాడు. ఆయన ఆగ్నేయ జర్మనీలోని ట్రై యర్ అనే ప్రాంతానికి చెందినవాడు. ఆయన తండ్రి ఆరేలియస్, స్పెయిన్, బ్రిటన్ మరియు ఆల్ఫైన్ ప్రాంతాలకు విస్తరించిన గౌల్ యొక్క ప్రిటోరియన్ ప్రిఫెక్ట్ (న్యాయ పరిపాలన మరియు సైన్యాధిపతి). ఇది రోమ్ కింద ఉన్న నాలుగు పెద్ద ప్రిఫెక్చర్లలో ఒకటి, ఇది ఆయన కుటుంబానికి చాలా ప్రభావాన్ని మరియు ప్రతిష్టను ఇచ్చింది. సెయింట్ ఆంబ్రోస్‌కు సటైరస్ అనే సోదరుడు, మార్సెల్లినా అనే సోదరి ఉన్నారు. వారు ఇద్దరూ సెయింట్ ఆంబ్రోస్ చేత బాగా ప్రభావితులై పరిశుద్ధులు అయ్యారు.

సెయింట్ ఆంబ్రోస్ రోమ్‌లో వాక్చాతుర్యం, న్యాయం, సాహిత్యానికి సంబంధించి ఎంతో విద్యను అభ్యసించాడు. అతను తన తెలివితేటలతో ప్రసిద్ధి చెంది, చిన్న వయసులోనే, తన తండ్రి అడుగుజాడలను అనుసరించి రాజకీయాల్లోకి వెళ్ళి స్థానిక కౌన్సిల్‌లో స్థానం సంపాదించాడు. క్రీ.శ.372లో అతను మిలాన్‌లోని ఒక ప్రాంతానికి కాన్సులర్ ప్రిఫెక్ట్ అయ్యాడు, అది గవర్నర్ స్థానంతో సమానం. మిలాన్ రోమన్ సామ్రాజ్యంలోని అత్యంత ముఖ్యమైన నగరాల్లో ఒకటి కావడంతో, అతనికి

గణనీయమైన ప్రభావాన్ని ఇచ్చింది. మిలాన్ యొక్క అరియన్ బిషప్ మరణించే వరకు అతను ప్రిఫెక్ట్‌గా కొనసాగాడు. అతను ఆ సమయంలో విస్తృతంగా ప్రజాదరణ పొంది బాగా ప్రసిద్ధి చెందాడు.

## బిషప్‌గా మారడం

క్యాథలిక్ చర్చి మరియు ఏరియనిజం మధ్య, ముఖ్యంగా మిలాన్‌లో, చాలా సంవత్సరాలుగా వివాదం కొనసాగుతోంది. యేసు దేవునికి లోబడి ఉన్నాడని మరియు దేవునిచే సృష్టించబడ్డాడని ఏరియన్లు విశ్వసించారు. ఇది త్రిత్వ క్యాథలిక్ బోధనకు విరుద్ధంగా ఉంది. క్రీ.శ.374లో, మిలన్ బిషప్ అయిన ఆక్సెంటియస్ మరణించాడు. ఏరియన్లు వెంటనే తమ లక్ష్యానికి అనుకూలమైన బిషప్‌ను కోరుతూ ఒత్తిడి చేయడం ప్రారంభించారు. నగరం ఎంతో అల్లకల్లోలంగా ఉండగా, ప్రజలలో గందరగోళాన్ని నివారించి శాంతి కోసం విజ్ఞప్తి చేయడానికి, బిషప్ ఎన్నిక జరుగుచున్న ప్రాంతానికి వెళ్ళాలని సెయింట్ ఆంబ్రోస్ భావించాడు. అతను ప్రజలను ఉద్దేశించి ప్రసంగించాడు, కానీ ఊహించని విధంగా పెద్ద సమూహాలు “ఆంబ్రోస్ ఫర్ బిషప్!” అని అరుస్తూ అంతరాయం కలిగించారు, అతను ఏకగ్రీవంగా బిషప్‌గా ఎంపికయ్యాడు. అతని ఎంపికలో ఏరియన్లు, క్యాథలిక్కులు ఇద్దరి నుండి ప్రజలు ఉన్నారు. ప్రతి ఒక్కరూ అతను వారి వైపు సానుభూతి చూపుతాడని భావించారు. సెయింట్ ఆంబ్రోస్ మొదట్లో ఆ పదవికి తాను తగినవాడు కాదని భావించి ఈ ప్రతిపాదనను తిరస్కరించాడు. అతను బాప్తిస్మం పొందలేదు, వేదాంతశాస్త్రంలో శిక్షణా పొందలేదు. అయితే, చక్రవర్తి వేలంటినియన్ ఆ నియామకాన్ని ప్రోత్సహిస్తూ ఒక లేఖ పంపి, అంగీకరించమని అతనిపై తీవ్ర ఒత్తిడి తెచ్చాడు. చివరికి ఆంబ్రోస్ అందుకు అంగీకరించి ఒక వారంలోనే బాప్తిస్మం పొంది, మొదటి కమ్యూనియన్ తీసుకుని పరిశుద్ధునిగా ధృవీకరించబడ్డాడు. డిసెంబర్ 7, 374న అతను మిలాన్ బిషప్‌గా నియమితుడయ్యాడు. అతను తన సోదరి కాన్వెంట్‌లో చేరడానికి తగినంత మాత్రమే ఆదా చేసుకుని, తన ఆస్తిలో ఎక్కువ భాగాన్ని దానం చేసాడు.

సెయింట్ సింప్లిషియన్ క్రింద ఆయన వేదాంతశాస్త్రం పూర్తిగా అభ్యసించారు. ఆయనకు అప్పటికే గ్రీకు భాషలో ప్రావీణ్యం ఉండటం వలన పాత నిబంధనను, కొంతమంది ప్రసిద్ధ గ్రీకు రచనలను అధ్యయనం చేయడానికి సహాయపడింది. అతను చివరికి పాత నిబంధన యొక్క వివరణపై దృష్టి పెట్టాడు. అతను త్వరగా “మతాధికారుల క్రమశిక్షణను, చర్చి ఐక్యతను, తన పదవి గౌరవాన్ని పునరుద్ధరించడం” ప్రారంభించాడు. కాన్‌స్టాంటైన్ శాసనంలో కొన్ని సంవత్సరాలుగా హింసను సహిస్తూ, చర్చి ఒక నిరంతర సమస్యతో ఉంది, చర్చి వ్యవహారాల్లో ప్రభుత్వ ప్రమేయం చూపడం, వారు “భూమిపై దేవునిరాజ్యం తీసుకురావడానికి దేవుని సాధనాలు” అని చాలా మంది రాజులతో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. పవిత్ర విషయాలపై చర్చికి స్వయంప్రతిపత్తి ఉండేలా ప్రభుత్వం, చర్చి మధ్య కఠినమైన విభజన అవసరమని సెయింట్ ఆంబ్రోస్ భావించాడు. ఈ విషయంపై ఆయన దృఢమైన వైఖరి అతని జీవితాంతం వరకు ప్రభుత్వంతో సంఘర్షణకు కారణమయ్యింది.

## చర్చి అభివృద్ధికి ప్రాముఖ్యత

సెయింట్ ఆంబ్రోస్ అన్ని వయసుల బిషప్‌లు, బోధకులు ఎలా ప్రవర్తించాలో ఉదాహరణలను ఉంచాడు. అతను ఏరియనిజం, అన్యమతవాదం, లౌకిక శక్తికి వ్యతిరేకంగా పోరాడాడు. అతను తన తెలివితేటలు, భక్తికి, వస్తువుల పట్ల దాతృత్వానికి కూడా ప్రసిద్ధి చెందాడు. చర్చి యొక్క నిజమైన బోధనలను అంకితభావంతో అతను ఎక్కడ వీలైతే అక్కడ సమర్థించాడు. అతను మేరీ పట్ల బలమైన భక్తిని కలిగి ఉన్నాడు, ఆమె కన్యత్వాన్ని, దేవుని తల్లి పాత్రను తీవ్రంగా సమర్థించాడు. విశ్వాసం మరియు నైతికత రెండింటిలోనూ, తన మాటలు, రచనల ద్వారా, అతను చర్చికి ఎంతో ప్రయోజనం చేకూర్చాడు. సెయింట్ జెరోమ్ చేత “ఎ పిల్లర్ ఆఫ్ ది చర్చ్” (చర్చి యొక్క స్తంభం) అని పిలువబడ్డాడు.

నిజమైన చర్చి బోధన, ధర్మం పట్ల ఆయనకున్న అంకితభావం ఆ కాలంలోని రాజకీయ శక్తులతో చాలా సంఘర్షణకు దారితీసింది. కాలం గడిచేకొద్దీ సెయింట్ ఆంబ్రోస్‌కు ఏరియన్లతో విభేదాలు కొనసాగాయి. ఆయన వక్తగా తన ప్రతిభను, కొత్తగా కనుగొన్న లేఖనాల జ్ఞానాన్ని ఉపయోగించి ఏరియన్ల స్థానాన్ని వేదాంతపరంగా తిరస్కరించారు.

అయితే, వివిధ చక్రవర్తులు పక్షపాతం వహించడంతో ఉద్రిక్తతలు పెరుగుతూనే ఉన్నాయి. తరువాత క్రీ.శ.381లో ముప్పై రెండు మంది బిషప్‌ల సినాడ్ సమావేశమైంది. ఆంబ్రోస్ అధ్యక్షుడిగా నియమితుడై, చర్చి లోపల నుండి ఏరియనిజాన్ని తరిమికొట్టడంలో విజయం సాధించాడు. అయితే, ఆ సంఘర్షణ అలాగే ఉండిపోయింది. ప్రభుత్వం మిలాన్‌లోని చర్చిలలో ఒకదాన్ని ఏరియన్లకు అప్పగించమని అంబ్రోస్‌ను బలవంతం చేయడానికి ప్రయత్నించింది. చక్రవర్తి వేలంటినియన్ తల్లి, కఠినమైన ఏరియన్, మిలాన్‌కు వెళ్ళి, అన్ని చర్చిలను తన నియంత్రణకు అప్పగించాలని తన కుమారున్ని ఒత్తిడి చేసింది. ఆమె కుమారుడు ఆ ఆజ్ఞ జారీ చేసాడు, కానీ ఆంబ్రోస్ ఇలా అన్నాడు, "చక్రవర్తికి తన రాజభవనాలు ఉన్నాయి, చర్చిలను బిషప్‌కు వదిలివేయనివ్వండి". సెయింట్ ఆంబ్రోస్ విశ్వాసులతో కలిసి, చర్చిని అప్పగించకుండా మరణ బెదిరింపుల నేపథ్యంలో కూడా డిమాండ్లకు లొంగలేదు. అతను చివరగా ఇలా రాశాడు, "మీరు నా వ్యక్తిత్వం తప్పుని రుజువు చేస్తే, నేను లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నాను; నన్ను జైలుకు లేదా మరణానికి తీసుకెళ్ళండి, నేను ఎదిరించను కానీ నేను క్రీస్తు చర్చిని ఎప్పటికీ మోసం చేయను నేను బలిపీఠం పాదాల వద్ద చనిపోతాను కానీ దానిని విడిచిపెట్టను". అతను అనేకుల మద్దతును పొంది చివరికి గెలిచాడు.

క్రీ.శ.390లో తూర్పు చక్రవర్తి అయిన థియోడోసియస్1, తన పాలనకు వ్యతిరేకంగా ప్రవర్తించిన వేలాది మందిని థెస్సలోనికాలో చంపాడు. పశ్చాత్తాపపడకపోతే థియోడోసియస్‌ను బహిష్కరిస్తానని సెయింట్ ఆంబ్రోస్ బెదిరించాడు. ఈ చర్య ఆంబ్రోస్‌ను ఉరితీయడానికి దారితీసేది, కానీ అతని ప్రభావం, వాక్చాతుర్యంతో గెలిచాడు. థియోడోసియస్ ఆగి పశ్చాత్తాపపడ్డాడు. అదే చక్రవర్తిని తర్వాత మతాధికారులకు మాత్రమే ప్రవేశం ఉన్న పరిశుద్ధ స్థలంలోకి వెళుతుండగా ఆంబ్రోస్ అడ్డుకున్నాడు.



ఆంబ్రోస్ చక్రవర్తిని మందలించగా అతను వెంటనే వెళ్ళిపోయాడు. సెయింట్ ఆంబ్రోస్ చర్చి అంతటా సెయింట్ అగస్టీన్‌తో సహా చాలా మందిపై గొప్ప ప్రభావాన్ని చూపాడు. సెయింట్ అగస్టీన్ తల్లి సెయింట్ మోనికా ద్వారా పరిచయం పొందిన తర్వాత, సెయింట్ అగస్టీన్ ఆంబ్రోస్ తెలివితేటలు, వాక్చాతుర్యం, దాతృత్వానికి త్వరగా ఆకర్షితుడయ్యాడు. అగస్టీన్‌కు మార్గనిర్దేశం చేసి బోధించిన తర్వాత, ఆంబ్రోస్ అతన్ని చర్చిలో స్వీకరించి క్రీ.శ.387లో ఈస్టర్ సందర్భంగా బాప్తిస్మం ఇచ్చాడు. తన పుస్తకం "కన్ఫెషన్స్"లో సెయింట్ అగస్టీన్ ఇలా అన్నాడు, "అతని ద్వారా నేను దేవుని దగ్గరకు నడిపించబడటానికి, నాకు తెలియకుండానే దేవుని ద్వారా నేను అతని వద్దకు నడిపించబడ్డాను". అతను ఇంకా ఇలా అన్నాడు, "ఆయన ప్రసంగంలోని మాధుర్యానికి నేను సంతోషించాను. ఆయనను నీ (దేవుని) భక్తిగల సేవకుడని, ఉత్తమ పురుషులలో ఒకడని పిలిచాడు".

సెయింట్ ఆంబ్రోస్ క్రీ.శ.397 ఏప్రిల్ 4వ తేదీ గుడ్ ఫ్రైడే రాత్రి సమయంలో మరణించాడు. ఆయన శరీరాన్ని మిలాన్‌లోని సెయింట్ అబ్రోగియో బసిలికా చర్చిలో ప్రదర్శనకు ఉంచారు.

డాక్టర్ ఆఫ్ ది చర్చ్ అనే బిరుదు ఉన్న ముప్పై ఐదుగురు వ్యక్తులలో సెయింట్ ఆంబ్రోస్ కూడా ఒకరు. ఒక వ్యక్తి యొక్క రచనలు, బోధనలు చర్చి యొక్క ఏ యుగంలోని క్రైస్తవులకైనా చాలా ఉపయోగకరంగా ఉంటాయని ఈ హోదా సూచిస్తుంది. అటువంటి పురుషులు, మహిళలు ముఖ్యంగా వారు ధర్మశాస్త్రాన్ని లోతుగా అర్థం చేసుకున్నవారుగా, వేదాంత బోధనల యొక్క ధర్మానికి కట్టుబడి ఉన్నవారుగా ప్రసిద్ధి చెందారు. ఈ డాక్టర్ల రచనలు తరచుగా పరిశుద్ధాత్మనిచే ప్రేరేపించబడినవిగా పరిగణించబడతాయి. మన చర్చిలోని ఇతర ముఖ్యమైన డాక్టర్లలో సెయింట్ అగస్టీన్, సెయింట్ థెరిసా ఆఫ్ అవిలా మరియు సెయింట్ థామస్ అక్వినాస్ ఉన్నారు. సెయింట్ ఆంబ్రోస్ రాజకీయాల నుండి బిషప్‌గా, అతి ముఖ్యమైన ఫాదర్లలో ఒకరిగా, డాక్టర్‌గా ఇంత తక్కువ సమయంలోనే మారారని గ్రహించడం స్ఫూర్తిదాయకం.

**– సి. పాల్ ప్రమోద్,** నంద్యాల





# రీల్స్ పిచ్చి
## వదిలించుకొందాం

ప్రస్తుతం యువతలో చాలా మంది రాత్రికి రాత్రే ఫేమస్ అయిపోయేందుకు తహతహలాడుతున్నారు. చిన్నపిల్లల నుంచి ముసలివాళ్ళ వరకు సోషల్ మీడియా వాడకం విపరీతంగా పెరిగిపోవటంతో ఆ క్రేజ్‌ను ఉపయోగించుకుని ఓవర్ నైట్ స్టార్ కావాలని పిచ్చి పిచ్చి ప్రయత్నాలన్నీ చేస్తున్నారు. కొందరు యూట్యూబ్ వీడియోలు చేస్తూ, వాళ్ళ ట్యాలెంట్‌ను ప్రదర్శించుకొంటూ డబ్బు కూడా సంపాదించుకుంటున్నారు. మరికొందరు మాత్రం వెంటనే వైరల్ అయిపోయి ఫేమస్ అయిపోదామని యూట్యూబ్ షార్ట్స్, ఇన్ స్టాలో రీల్స్ కోసం రిస్కులు చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఇదంతా నాణేనికి ఒకవైపు అయితే, మరోవైపు అన్ని పనులు మానేసి, ఆ రీల్స్‌ను గంటల తరబడి చూసేవారు, టైమ్ పాస్ చేసేవారు ఎక్కువైపోయారు. చాలామందికి ఇది వ్యసనంలా మారింది. దీనికి విశ్వాసులు కూడా అతీతులు కాదు. వీటిని ఎక్కువగా చూడటం వల్ల వాళ్ళ చదువుపై, ఆరోగ్యంపై కొన్ని చెడు ప్రభావాలు పడుతున్నాయి. అయితే, బైబిల్‌లో ఉన్న మంచి విషయాలు మనకు ఈ సమస్యల నుండి ఎలా బయటపడాలో నేర్పిస్తాయి.

### వీటి వల్ల కలిగే చెడు ప్రభావాలు

షార్ట్ వీడియోలు మనల్ని త్వరగా ఆకట్టుకుంటాయి. ఎప్పుడూ ఏదో కొత్తది చూపిస్తూ మనల్ని అతుక్కుపోయేలా చేస్తాయి. కానీ, దీనివల్ల:

1. **ఏకాగ్రత తగ్గిపోతుంది:** త్వరగా మారిపోయే వీడియోలు చూసి మన మెదడు దానికి అల వాటు పడిపోతుంది. దీంతో, ఎక్కువ సేపు పుస్తకాలు చదవడం, తరగతిలో పాఠాలు వినడం వంటివి చేయడానికి ఏకాగ్రత పెట్టడం కష్టమవుతుంది.
2. **వీటికి బానిస అయ్యే అవకాశం ఉంది:** వీడియోలు చూసినప్పుడు మనకు సంతోషాన్నిచ్చే కెమికల్ (డోపామైన్) విడుదల అవుతుంది. ఇది డ్రగ్స్ లాగే వ్యసనంగా మారవచ్చు. దీంతో, వాటిని చూడకుండా ఉండలేరు.
3. **మానసిక ఆరోగ్యం పాడవుతుంది:** ఈ వీడియోలలో అందరూ తమ జీవితాలను చాలా గొప్పగా చూపిస్తారు. అది చూసి మనల్ని మనం తక్కువగా అంచనా వేసుకుంటాం. అసూయ, బాధ కలుగుతాయి. కొందరు వేరేవాళ్ళను ఆన్ లైన్‌లో ఏడిపిస్తారు (సైబర్ బుల్లీయింగ్). చెడు విషయాలు చూడటం వల్ల కూడా ఆందోళన, నిస్పృహ వంటివి రావచ్చు. తమ రూపురేఖల గురించి బాధపడవచ్చు.
4. **నిద్ర సరిగా పట్టదు:** రాత్రిళ్ళు వీటిని చూడటం వల్ల ఫోన్ లైట్ కళ్ళపై పడి నిద్ర రాకుండా చేస్తుంది. మెదడు యాక్టివ్‌గా ఉండి త్వరగా నిద్ర పట్టదు. నిద్ర సరిగా లేకపోతే చదువుపై, మూడ్ పై ప్రభావం పడుతుంది.
5. **చదువు సరిగ్గా సాగదు:** వీడియోలకు అల వాటు పడితే చదవాల్సిన సమయాన్ని వాటికే కేటాయిస్తారు. ఏకాగ్రత లేకపోవడం వల్ల చదివినా అర్థం కాదు. పరీక్షల్లో మార్కులు తగ్గుతాయి.
6. **చెడు విషయాలు చూసే అవకాశం:** ఈ ప్లాట్‌ఫామ్స్‌లో చాలా వీడియోలు త్వరగా

అప్‌లోడ్ అవుతాయి. మంచివాటితో పాటు చెడువి, తప్పుదారి పట్టించేవి కూడా ఉంటాయి.

7. **నిజమైన స్నేహాలు దూరమవుతాయి:** ఎక్కువగా ఫోన్ పట్టుకుని ఉంటే స్నేహితులతో, కుటుంబ సభ్యులతో నేరుగా మాట్లాడటం తగ్గిపోతుంది. దీంతో, నిజమైన అనుబంధాలు తగ్గిపోయి ఒంటరిగా అనిపించవచ్చు.

## బైబిల్ చెప్పే మంచి పరిష్కారాలు

సోషల్ మీడియా గురించి బైబిల్ నేరుగా చెప్పకపోయినా, ఈ సమస్యల నుండి బయటపడటానికి చాలా మంచి విషయాలు నేర్పిస్తుంది:

1. **నీ హృదయాన్ని కాపాడుకో (సామెతలు 4:23):** నీ హృదయంలోకి (మనస్సులోకి) ఏమి వెళ్తుందో జాగ్రత్త వహించుకో. మంచి ఆలోచనలు, మంచి విషయాలు మాత్రమే ఉండేలా చూసుకో. చెడు వీడియోలు, ఆలోచనలు మనల్ని పాడు చేస్తాయి.

2. **నీ మనస్సును మార్చుకో (రోమా 12:2):** ఈ లోక పద్ధతులకు అలవాటు పడకుండా నీ ఆలోచనలను మార్చుకోమని బైబిల్ చెబుతుంది. నిజమైన, మంచి విషయాలు నేర్పేవాటిని మాత్రమే చూడు. దేవునికి ఇష్టమైనవి నేర్పేవాటిపై దృష్టి పెట్టు.

3. **ఆత్మ నియంత్రణ కలిగి ఉండు (గలతీ 5:22-23, 2 పేతురు 1:5-6):** నీ ఫోన్ వాడకాన్ని నువ్వే నియంత్రించుకోవడం నేర్చుకో. ఎంతసేపు చూడాలి, ఎప్పుడు చూడకూడదు అని కొన్ని నియమాలు పెట్టుకో. వాటిని పాటించడానికి ప్రయత్నించు. దేవుని సహాయాన్ని కోరుకో.

4. **సమయాన్ని సరిగా ఉపయోగించుకో (ఎఫెసీ 5:15-16):** మన సమయం చాలా విలువైనది. దాన్ని దేవునికి ఇష్టమైన పనులకు, నీ ఎదుగుదలకు ఉపయోగించుకోవాలి. వీడియోలు చూస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకోకు.

5. **ఇతరుల మెప్పు కాదు, దేవుని మెప్పు కోరుకో (గలతీ 1:10):** సోషల్ మీడియాలో లైకులు, కామెంట్ల కోసం ఎదురుచూడటం ఎక్కువ. నీ నిజమైన విలువ క్రీస్తులోనే ఉందని బైబిల్ చెబుతుంది. మనుష్యులు ఏమనుకుంటారో అని బాధపడకుండా, దేవుడు నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నాడో గుర్తుంచుకో.

6. **ఉన్నదానితో సంతృప్తి చెందు (ఫిలిప్పీ 4:11-13):** ఇతరులు గొప్పగా ఉన్నారని చూసి నువ్వు బాధపడకు. దేవుడు నీకు ఏమి ఇచ్చాడో దానితో సంతోషంగా ఉండటం నేర్చుకో.

7. **ఏది మంచిదో, నిజమో దానిపైనే దృష్టి పెట్టు (ఫిలిప్పీ 4:8):** ఏది నిజం, ఏది మంచిది, ఏది గౌరవప్రదమైనది, ఏది పవిత్రమైనది వంటి వాటిని మాత్రమే చూడు. చెడు విషయాలు, తప్పుడు సమాచారాన్ని పక్కన పెట్టు.

8. **నీ చింతలన్నీ దేవునిపై వేయు (1 పేతురు 5:7):** సోషల్ మీడియా వల్ల నీకు ఆందోళన కలిగితే, వాటిని దేవునికి ప్రార్థనలో చెప్పుకో. ఆయన నిన్ను చూసుకుంటాడు. అప్పుడు నీకు శాంతి కలుగుతుంది.

9. **నిజమైన స్నేహితులతో కలిసి ఉండు (సామెతలు 17:17):** నేరుగా కలిసి మాట్లాడటం, స్నేహితులతో సమయం గడపడం చాలా ముఖ్యం. కుటుంబంతో, చర్చిలో విశ్వాసులతో సమయం గడుపుతూ మంచి బంధాలను పెంచుకో. వాళ్ళు నీకు అండగా ఉంటారు.

10. **సత్యాన్ని తెలుసుకో (1 యోహాను 4:1):** ఆన్‌లైన్‌లో చాలా అబద్ధాలు వస్తాయి. ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకో నేర్చుకో. దేవుని వాక్యం మాత్రమే నిజమని గుర్తుంచుకో.

## ముగింపు

ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ చూడటం సరదాగా ఉన్నా, వాటి వల్ల వచ్చే చెడు ప్రభావాల గురించి విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి. బైబిల్ చెప్పినట్లుగా, మనల్ని మనం నియంత్రించుకుంటూ, సమయాన్ని సరిగా వాడుకుంటూ, దేవునిలో మన విలువను తెలుసుకుంటూ, ఉన్నదానితో సంతోషిస్తూ, మంచి విషయాలు మాత్రమే చూస్తూ, నిజమైన స్నేహితులతో కలిసి ఉంటే, మనం ఈ డిజిటల్ ప్రపంచంలో ఆరోగ్యంగా మరియు సురక్షితంగా జీవించగలము.

– **పిసి. పాల్ జాషువ,** స్టాఫ్, విజయవాడ



ఫ్యామిలీ

# ఏకత్వము

## మనమిద్దరం ఒక్కటే

"మేము ఇద్దరం రక్షణ పొంది చాలా సంవత్సరాలు అయ్యింది. వచ్చే ఫిబ్రవరి 14న మా ఇరవయ్యవ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోవాలని మేము ప్లాన్ చేస్తున్నాము. సీనియర్స్‌గా మాకు వివాహ విషయం గురించి మంచి జ్ఞానమే ఉంది, అనేక సదస్సులలో బోధకులుగా కూడా ఉన్నాము. అయినప్పటికీ మేము వివాహంలో ఏకత్వాన్ని అనుభవించే దిశలో ఎన్నో సవాళ్ళు, సమస్యలు, సంఘర్షణలు ఎదుర్కొంటూనే ఉన్నాము. ఒకరంటే మరొకరికి అమితమైన ప్రేమ ఉన్నా, ఎక్కడో కనబడని గోడలు, దాటలేని దూరాలు, ఏకమవ్వలేని అంతరాలు మా మధ్య ఉన్నాయి. వివాహంలో ఏకత్వం ఎండమావేనా? ఎక్కలేని కొండేనా? జీవితాంతం ఇలా సర్దుకుపోవడమేనా? మనసంతా తెలియని వెలితితో ఉంటుంది".

మీ సమస్య కూడా ఇదేనా? వివాహమై ఏళ్ళు గడుస్తున్నా ఇద్దరి మధ్య ఏక్యతం ఎండమావిగా ఉంటుందా? వివాహంలో అసలు ఏకత్వాన్ని పొందడం అంటే ఏంటి? భార్యాభర్తలు తమ వైవాహిక సంబంధంలో ఒంటరితనం వైపు ఎంత దూరం ప్రయాణించినా, "వివాహ ఏకత్వాని"కి దారితీసే మార్గంలో పునః ప్రయాణం ఎలా? దేవుని వాక్యం దీని గురించి ఏమి చెబుతుంది? మొదలగు విషయాలను ఈ వ్యాసంలో చూద్దాం.

### వివాహానికి మూలం దేవుడే

❖ వివాహ వ్యవస్థాపకుడు, రూపకర్త దేవుడే (ఆది 2:18–25)

❖ వివాహం అంటే పురుషుడు, స్త్రీ అన్ని ఇతర భూసంబంధమైన సంబంధాలను విడిచిపెట్టి, ఒకరినొకరు హత్తుకుంటూ, వెంబడిస్తూ దేవుని ముందు ఒకే వ్యక్తిగా మారడం (మత్తయి 19:3–12).

❖ వివాహం ఒక పురుషుడు, ఒక స్త్రీ మధ్య మాత్రమే ఉంటుంది (ఆ.కా2:24,25)

❖ వివాహం ఒక గంభీరమైన నిబంధన/ఒడంబడిక (వాగ్దానం) (మలాకీ 2:13,14)

❖ వివాహం అన్నిటి కన్నా గౌరవించాల్సిన, ఘనపరచాల్సిన వ్యవస్థ. పాన్పు నిష్కల్మ షంగా ఉండాలి. భార్యాభర్తల మధ్య అతి సన్నిహిత సంబంధం, ఏకత్వాన్ని సూచించే పోలిక పాన్పు. లైంగిక సాన్నిహిత్యం అనేది భార్యాభర్తల మధ్య మాత్రమే ఉంటుంది. వారి వివాహంలో ఏక త్వానికి, ఐక్యతకు వ్యక్తీకరణగా ఉద్దేశించబడింది గనుక లైంగిక సాన్నిహిత్యాన్ని పవిత్రంగా భావించి, స్వచ్ఛతతో కాపాడుకోవాలి. వివాహేతర మోహానికి, కామానికి, కాంక్షకు, లైంగిక సంబంధాలకు తావు లేదు. అది జారత్వం, వ్యభిచారం. అట్టివారికి దేవుడు తీర్పు తీరుస్తాడు (హెబ్రీ 13:4). వివాహ ధర్మ పతి – పత్ని కాకుండా ఎవరితోనైనా శరీరము వెళ్ళినా, మనస్సు వెళ్ళినా కూడా అది వ్యభిచారమని యేసుప్రభువు బోధించారు. కావున పరిశుద్ధ వివాహ జీవితంలో భార్యాభర్తలు తమ ఘటాలను (ప్రాణాత్మ దేహాలను) పరిశుద్ధముగా కాపాడుకోవడం తెలిసి ఉండటమే దేవుని చిత్తము. కామాభిలాషకులకు చోటు లేదు (1థెస్స 4:4–5).

❖ వివాహ ఉద్దేశ్యం, అంతిమ గమ్యం ఏక శరీరం, ఒక్కటి కావడం. ఏకత్వం వివాహ పరమార్థం (ఆ.కా. 2:24; మత్త 19:5; ఎఫె 5:31)

❖ భార్యాభర్తలు ఏకశరీరంగా ఉన్నారు. ఇద్దరు గాక ఒక్కరిగా ఉన్నారు. గనుక దేవుడు జతపరచినవారిని మనుష్యుడు వేరుపరచ కూడదు. భార్యాభర్తలు ఇరువురు కూడా ఏ కారణమును బట్టి కూడా ఎడబాయకూడదు. వేరవ్వకూడదు. (మత్తయి 19:6 )

❖ వ్యభిచారం నిమిత్తం తప్ప తన భార్యను విడనాడి వేరొక స్త్రీని (అవివాహిత, వివాహిత, విధవరాలు) పెండ్లిచేసుకొనేవాడు వ్యభిచారం చేస్తున్నాడని, విడనాడబడిన దానిని పెండ్లిచేసుకొనేవాడు వ్యభిచారం చేస్తున్నాడని యేసు క్రీస్తు శిష్యులకు ఖండితంగా చెప్పాడు (మత్తయి 19:9)

## ఏకత్వం

వివాహ ప్రమాణాల ద్వారా భార్యా భర్తలు అయిన వారిద్దరూ ఇప్పుడు ఒకటి. ఒకటి + ఒకటి వివాహంలో ఒకటికి సమానం. దేవుడు ఏ కాంగులను సంసారులుగా చేసి ఒంటరితనాన్ని తీసివేశాడు. వారు ఒంటరిగా ఉన్నామని పాక్షికంగా మాత్రమే చెప్పగలరు. వాస్తవానికి వారు ఏంటో వారి ద్విత్వంలో మాత్రమే వ్యక్తమవుతుంది – ద్విత్వం అంటే ఏకత్వం, ద్విఏకత్వం, మన ఇద్దరమూ ఒకటి. త్రిత్వంలోని ఏకత్వం భార్యాభర్తలు సంబంధంలో ఏకత్వానికి ఆధారం, మాదిరి.

చాలా సార్లు మ్యాచింగ్ వస్త్రాలు వేసుకొని అందరికి చూడ ముచ్చటగా కనబడతారు కానీ 'పైన పటారం లోన లొటారం'లా, మట్టి గోడ మీద గచ్చు పోతలా ఉంటుంది పరిస్థితి. 'మేము కనెక్ట్ అయినట్లు అనిపించడం లేదు, మా మధ్య ఏకత్వం లేదు' అని చాలామంది భార్యాభర్తలు వాపోతుంటారు. వివాహమైన తరువాత క్రమేణా కాలక్రమంలో ఎక్కడో వారు డిస్కనెక్ట్ అవటం, దూరమవ్వడం, విడిపోవడం ప్రారంభించారు. ఇప్పుడు వారు సన్నిహితంగా ఒకరితో ఒకరు పెనవేసుకొని జీవితాలను గడపడానికి బదులు సమాంతర ట్రాక్లో నడుస్తున్న జీవితాలను గడుపుతున్నట్లు భావిస్తున్నారు. మరి వీరి "ఏకత్వం" సమస్యకు పరిష్కారం ఏంటి?

ఏకత్వం అనేది బహుముఖ విషయం అని అర్థం చేసుకోవడం, తిరిగి కనెక్ట్ కావడానికి కీలకమైన అంశాలలో ఒకటి. 'సాన్నిహిత్యం/ఏకత్వం' అనే పదాన్ని విన్నప్పుడల్లా చాలా మంది శారీరక/ లైంగిక సాన్నిహిత్యం అనుకొంటారు. వాస్తవానికి వివాహ సాన్నిహిత్యం సెక్స్ కంటే ఎక్కువ అని అంటారు జాన్ పైపర్. జీవిత భాగస్వాములు ఒకరితో ఒకరు కనెక్ట్ అయ్యి ఏకమవ్వడానికి జాన్ పైపర్ ఐదు రకాల సాన్నిహిత్యాల్ని సూచించారు.

1. ఆధ్యాత్మిక సాన్నిహిత్యం/ఏకత్వం
2. ఆహ్లాదకరమైన సాన్నిహిత్యం/ఏకత్వం
3. మేధో సాన్నిహిత్యం/ ప్రజ్ఞా పరమైన సాన్నిహిత్యం, ఏకత్వం
4. భావోద్వేగ సాన్నిహిత్యం/ఏకత్వం
5. శారీరక సాన్నిహిత్యం/లైంగిక సాన్నిహిత్యం/ ఏకత్వం

### 1. ఆధ్యాత్మిక సాన్నిహిత్యం/ఏకత్వము

ఆధ్యాత్మిక ఏకత్వం మొట్ట మొదటి మెట్టు, అత్యంత ప్రాముఖ్యమైన పునాది. ఇది మిగిలిన వాటన్నిటిని కలిపే కేంద్రంగా చూడవచ్చు. 'కలిసి ప్రార్థించే కుటుంబం కలిసి ఉంటుందనే' పాత సామెత సాధారణంగా నిజం. నామకార్థ, ఆచారంగా చేసే కుటుంబ ప్రార్థన కాదు. యథార్థమైనది, ఇద్దరూ దేవునికి, ఒకరికి ఒకరు దగ్గరై ఏకత్వాన్ని కలిగించేదిగా ఉండాలి.

దేవుని వాక్యం మన ఆత్మలకు పోషణ (మత్తయి 4:4; ద్వితీయో 8:3). ఆధ్యాత్మిక ఏకత్వం కలిసి వాక్యంలో ఎదగటం, కలిసి ఆరాధించడం, కలిసి ప్రార్థించడం, ఒకరి కోసం ఒకరు ప్రార్థించడం ద్వారా వస్తుంది. ఆధ్యాత్మిక సత్యాల పట్ల ఏకాభిప్రాయం, ఏకతాత్పర్యం ఉండాలి. ఏ సంఘానికి వెళ్ళాలి, ఏ సహవాసానికి వెళ్ళాలి, ఏ పరిచర్య చేయాలి, దేవునికి ధనాన్ని, సమయాన్ని, తలాంతులు ఉపయోగించే విషయంలో ఏక మనస్సు, ఏకత్వం ఉండాలి. ఆత్మలు ఏకమవ్వాలి.

"ఆధ్యాత్మిక ఏకత్వము ఎక్కువగా ఉంటే, ఇతర రకాల ఏకత్వము, జీవితంలో మార్పులకు అనుగుణంగా సర్దుకుపోగల సహజ స్థితిస్థాపకతను కలిగి ఉంటుంది."



## 2. ఆహ్లాద సాన్నిహిత్యం/ఏకత్వం

ఆహ్లాదంలో ఏకత్వం అనేది కలిసి కార్యకలాపాలు చేయడం ద్వారా కలుగుతుంది, బలపడుతుంది. భాగస్వాములిద్దరూ ఒకరి సమక్షంలో ఒకరు ఉండటానికి ఆహ్లాదకరమైనవి కలిసి చేయాలి. కలిసి ప్రార్థించడమే కాక, కలిసి ఆడుకోవటం, మాట్లాడుకోవడం కూడా కుటుంబం కలిసి ఉండేలా ఆనందించేలా చేస్తుంది. వారి పరస్పర ఆనందం దంపతుల అనుబంధాన్ని పెంచుతుంది.

ఉద్యోగాలు, పిల్లలు, ఇల్లు, పరిచర్య, పనులన్నిటితో జీవితం మరింత క్లిష్టంగా మారుతున్నప్పుడు, వినోద కార్యకలాపాలలో పాల్గొనే అవకాశాలు తగ్గుతాయి. ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. కుదిరినా దీనిని మనము అంతగా పట్టించుకోము. కొన్ని సార్లు ఇది పాపమని, ఆత్మీయత కాదని అనుకొనే తప్పుడు అభిప్రాయలు ఉన్నాయి. అయితే దేవుడు మన జీవితాన్ని, ముఖ్యంగా మన జీవిత భాగస్వాములతో ఆనందించేలా చేశాడు (ప్రసంగి 9:9). మన వైవాహిక జీవితంలో కన్నీళ్లు, కష్టాలను భరించాలంటే కలిసి నవ్వే, ఆడుకునే సామర్థ్యం అవసరం.

## 3. మేధో సాన్నిహిత్యం/ ప్రజ్ఞా పరమైన సాన్నిహిత్యం

కొన్ని అంశాలను చర్చించడం ద్వారా ఒకరితో ఒకరు కనెక్ట్ అయ్యే అవకాశం ఉంటుంది. అంశాలు తేలికైనవి, తీవ్రమైనవి కావచ్చు. ఇది మీ జీవిత భాగస్వామితో కలిసి చేసే మానసిక వ్యాయామం. సంబంధాలను బలోపేతం చేస్తుంది.

వినోద సాన్నిహిత్యం, మేధో సాన్నిహిత్యం దంపతుల వైవాహిక జీవిత ప్రారంభంలో అత్యున్నత స్థాయిలో ఉంటుంది. క్రమేపి ఒకరినొకరు తెలుసుకుంటూ, కాలం గడిచేకొద్దీ వివిధ అంశాలపై వారు ఎలా ఆలోచిస్తున్నారో తెలుసు కదా అని మాట్లాడుకోటానికి అంత ఆసక్తిగా ఉండరు. ఒకరి మేధో ప్రపంచాలను ఒకరు అన్వేషించడం మానేస్తారు. ఒక నిర్దిష్ట సమస్యపై మరొకరు ఏమనుకుంటారో జీవిత భాగస్వామిని తరచుగా అంచనా వేయగలిగినప్పటికీ, ఎన్నిసార్లు ఒక సమస్యను చర్చించినా, దాదాపు ఎప్పుడూ కొత్తగా ఉండే, అన్వేషించగల దేదో ఒకటి ఉంటుందని గ్రహించి అలా మానసిక మేధో సంపత్తిని పంచుకోవాలి. భిన్న అభిప్రాయాలలో కూడా ఏకత్వాన్ని పొందగలమనే పరిపక్వతతో ఉండాలి.



## 4. భావోద్వేగ సాన్నిహిత్యం/ఏకత్వము

భావోద్వేగ సాన్నిహిత్యం అంటే మీ భావాలు, ఆలోచనలు, అవసరాలు, ఆశలు, ఆకాంక్షలు, భయాలు, బాధలు, పోరాటాలను మీ భాగస్వామితో పంచుకోవడం. గ్యారీ యాగెల్ తన రచన "భావోద్వేగ సాన్నిహిత్యం, స్త్రీ తన భర్తతో హృదయ స్థాయిలో కనెక్ట్ అవ్వడం"లో బైబిల్ ఆధారంను ప్రస్తావిస్తూ 1పేతురు 3:7లో, "అటువలెనే పురుషులారా, జీవమను కృపావరములో మీ భార్యలు మీతో పాలివారైయున్నారని యెరిగి, యెక్కువ బలహీనమైన ఘటమని భార్యను సన్మానించి, మీ ప్రార్థనలకు అభ్యంతరము కలుగకుండునట్లు, జ్ఞానము చొప్పున వారితో కాపురము చేయుడి", అని రాయబడింది. అంటే "నీ భార్యకు అన్నిటి కంటే మించిన మొదటి అవసరం ఏమిటంటే, ఆమెను అర్థం చేసుకోవడం, అంటే ఆమె హృదయంలో ఏమి జరుగుతుందో తెలుసుకోవడం" అని పేతురు చెబుతున్నాడు.

భావోద్వేగ సాన్నిహిత్యం కోసం స్త్రీలకున్న అమితమైన ఆశను గూర్చి పరమ గీతములో స్పష్టముగా రాయబడింది. ఆది.కా. 2:24-25లో కూడా మొదట "జీవితాల కలయిక" (పురుషుడు తన తండ్రిని, తల్లిని విడిచిపెట్టి తన భార్యను హత్తుకోవాలి). తర్వాత "శరీరాల కలయిక" (వారు ఏక శరీరం అవుతారు)ను గూర్చిన వివరణ ఉంది. భార్యాభర్తలిద్దరూ వస్త్రాలు లేకున్నా సిగ్గుపడలేదు. భార్యా భర్తలు తమ వైవాహిక జీవితాల్లో తమ ఆలోచనలు, నిర్ణయాలు, ఇష్టాలు, భావోద్వేగాలను పంచుకొంటారు. హృదయాలు, మనస్సులు, సంకల్పాల కలయిక, శరీరాలు లైంగిక సంబంధంలో కలిసిపోవడం ద్వారా ఏకత్వాన్ని పొందుతారు.

మేధో సాన్నిహిత్యం, భావోద్వేగ సాన్నిహిత్యం మధ్య తేడాను గుర్తించడంలో పురుషులు ఇబ్బంది పడతారు. పురుషులు సాధారణంగా చాలా పరిమితమైన భావోద్వేగ పదజాలాన్ని కలిగి ఉంటారు అని, భావోద్వేగాల అనుభవాలను చర్చించడానికి,

సంభాషించటానికి సుముఖంగా ఉండరని అంటారు. అందువల్ల, పురుషులు తమ భార్యలు మాట్లాడేటప్పుడు తప్పుగా అర్థం చేసుకుంటారు. కానీ ఆమె కోరుకునేది ఆమె భావోద్రేకాలను, భావాలను గుర్తించి, పట్టించుకొనే వ్యక్తిని. స్త్రీలు వారి మానసిక, భావోద్రేక సాన్నిహిత్యం ద్వారా ఏకత్వము అనుభవిస్తారు.

### 5. శారీరక సాన్నిహిత్యం

నేటి మన సంస్కృతిలో ఉన్న సమస్య, వివాహం చేసుకోకుండా లైంగిక సంబంధాలు గల సింగిల్స్ ఒక ప్రక్క, ఎలాంటి శారీరక ప్రమేయం, సంబంధం లేకుండా వివాహం చేసుకున్న దంపతులు మరో ప్రక్క. కేవలం సోల్ మేట్స్‌గా మాత్రమే ఉంటూ సెక్స్ మేట్స్ కానీ వివాహితులు కూడా ఉన్నారు.

వివాహం చేసుకున్న వారికి వైవాహిక జీవితంలో బ్రహ్మచర్యానికి స్థానం లేదు. ఒంటరిగా జీవించడానికి వివాహం చేసుకోకూడదు. అయితే "నాకు ఈ విషయాలు తెలియదు. సినిమాలు చూడలేదు. పుస్తకాలలో కూడా చదవలేదు" అని చాలా మంది అనవచ్చు. సరే కానీ పరిశుద్ధ గ్రంథంలో పరిశుద్ధ వివాహం గూర్చి, నిష్కల్మషమైన పాన్పు గూర్చిన బోధ ఉంది. వాటి విషయమై అజ్ఞానులు కాక జ్ఞానముతో సంసారంలో ఒకరి అవసరాలు ఒకరు తీర్చాలని రాయబడింది.

1 కొరింథీ 7లో భార్యాభర్తల ధర్మాలు, బాధ్యతల గురించి ఆచరణాత్మకమైన సూచనలను పౌలు సూటిగా బోధించాడు.

శారీరక సాన్నిహిత్యం - ఒక బాధ్యత. 3వ వచనంలో వైవాహిక స్థితికి ప్రత్యేకమైన బాధ్యతలు: "భర్త తన భార్య పట్ల తన వైవాహిక విధిని నిర్వర్తించాలి, అలాగే భార్య తన భర్త పట్ల తన వైవాహిక విధిని నిర్వర్తించాలి." ఇక్కడ హక్కుల గురించిన ప్రాధాన్యత కాదు కానీ బాధ్యతలపై ఉందని గమనించాలి. విధులు ప్రాముఖ్యం.

వివాహములో భార్య భర్త ఇద్దరూ ఒకరికి ఒకరు లైంగిక సంతృప్తిని ఇవ్వడం ప్రతి భాగస్వామి యొక్క బాధ్యత. అది వారి విధి! పరిశుద్ధ వివాహ బంధము పరిధిలో మాత్రమే మీరు మీ విధిని నెరవేర్చాలని పౌలు బోధిస్తున్నాడు. మీరు వివాహం చేసుకొని కూడా ఎవరో సూపర్-క్రిస్టియన్‌లాగా బ్రహ్మచర్యం, లైంగిక విధిని అశ్రద్ధ చేయడం లేదా పరిత్యజించడం గురించిన అర్థం పర్థం లేని విషయాలను పాటించకూడదు. ప్రస్తావించకూడదు. ఇది వివాహములో దైవ ధర్మానికి విరుద్ధం. అలాంటి అజ్ఞానములో ఉంటే దేవుని దగ్గర ఒప్పుకోవాలి. భాగస్వామిని క్షమించమని అడగాలి. దేవుని సహాయంతో, అవసరమైతే పెద్దల లేదా వైద్యుల సాయం తీసుకోవాలి. వారి వారి ధర్మాలు నిర్వర్తించాలి. కానీ విడిపోయి వేరొకరితో లైంగిక కోరికలు తీర్చుకోకూడదు. లివింగ్ రిలేషన్షిప్స్ వాఖ్య విరుద్ధం.

4వ వచనంలో భార్య శరీరం ఆమెకు మాత్రమే చెందినది కాదు, ఆమె భర్తకు కూడా చెందినది. అదే విధంగా, భర్త శరీరం అతనికి మాత్రమే చెందినది కాదు, అతని భార్యకు కూడా చెందినది. మరో మాటలో చెప్పాలంటే, వివాహ ప్రమాణం ద్వారా, మనం శాశ్వతంగా మార్చలేని ఒప్పందాన్ని చేసుకొన్నాము. మనపై మనకున్న ప్రత్యేక హక్కును మనం వదులుకున్నాము. ఇద్దరూ ఇప్పుడు ఒకటిగా మారారు. క్రీస్తు క్రింద ఒకటిగా, జీవనశైలిలో స్వచ్ఛత కోసం దైవిక ఆదేశాలను వారు ఎప్పటికీ నెరవేర్చాలి.

### నిరాకరించకూడదు

5వ వచనము ..బాధ్యత ఉంది కాబట్టి, సాధారణ పరిస్థితులలో నిరాకరించడానికి అనుమతి లేదు. ఒకరినొకరు దూరం చేసుకోకండి. ఇద్దరి సమ్మతితో కొంత ఎడబాటు ఉండవచ్చు కానీ మరలా వెంటనే ఒకరితో ఒకరు కలిసి ఉండాలి. వైద్య కారణాలు, అనారోగ్యము లాంటి ప్రత్యేక పరిస్థితులలో నిగ్రహం పాటించాలి కానీ, యిబ్బంది పెట్టకూడదు, విడిచి పెట్టకూడదు, విడాకుల ప్రసక్తే ఉండకూడదు.

పురుషులు, స్త్రీలు ప్రేమ, సాన్నిహిత్యాన్ని వ్యక్తపరచడంలో, అనుభవించడంలో భిన్నంగా ఉంటారు. ఇద్దరికీ లైంగిక అవసరాలు ఉంటాయి. అయితే, పురుషులకు ఎక్కువ. పురుషులు సెక్స్ అనేది ప్రేమ యొక్క వ్యక్తీకరణ అని భావిస్తారు. మహిళలు తన వివాహంలోని ప్రతి అంశంలో తన భర్తతో సన్నిహిత సంబంధం నుండి వచ్చేదిగా సెక్స్‌ను చూస్తారు. మహిళలకు లైంగికేతర స్పర్శ ఆహ్లాదాన్నిస్తుంది, ఓదార్పునిస్తుంది. లైంగిక చర్య కంటే కలిసి ఉండటం పట్ల స్త్రీలకు మక్కువ ఎక్కువ.

స్త్రీలు మనసారా కలిసి ఉండటం, సమయం గడపడం, మనసులు కలవాలి, మాటలు వినాలని, మాటలు చెప్పాలని కోరుకొంటారు. మనసులు ఒకటైతే మనువులు కలవటానికి సిద్ధముగా ఉంటారు.

స్త్రీలు తమ భర్త లైంగికతను కాపాడుకోవడానికి పిలువబడినట్లే పురుషులు కూడా తమ భార్య హృదయాన్ని కాపాడుకోవాలి. శారీరక సాన్నిహిత్యం అత్యధికంగా ఉన్నప్పుడు పురుషులు ఎక్కువగా కనెక్ట్ అయినట్లుగానే, భావోద్వేగ సాన్నిహిత్యం అత్యధికంగా ఉన్నప్పుడు మహిళలు సాధారణంగా ఎక్కువగా కనెక్ట్ అయినట్లు భావిస్తారు. ఆదాము హవ్వతో మొదట ప్రేమ కవితతో భావోద్రేకంగా కనెక్ట్ అయిన తర్వాత శారీరకంగా ఏకమయ్యారు (ఆది 2:23).

### సాన్నిహిత్యం - ఒంటరితనం

#### ఏకత్వాన్ని పాడుచేసేవి/చులకన చేసేవి

- ❖ వివాహం పట్ల దేవుని ఉద్దేశ్యం ఏకత్వం అని గ్రహించడంలో వైఫల్యం
- ❖ భార్య ప్రాథమిక అవసరాన్ని/ భర్త ప్రాథమిక అవసరాన్ని అర్థం చేసుకోవడంలో వైఫల్యం
- ❖ స్వార్థం, పంతం, కోపం, క్షమించలేకపోవడం, ప్రేమలేనితనం, తగ్గించుకోలేనితనం
- ❖ పతనమైన ప్రపంచంలో స్వీయ గౌరవం, రక్షణ కోసం మనం నిర్మించిన కనపడని గోడలు
- ❖ వివాహేతర సంబంధాలు, కామవికారాలు -వివాహానికి ముందున్న స్నేహాలు, సంబంధాలు, వివాహము తర్వాత ఆకర్షణలు, అవాంఛనీయ అతి చనువులు-డిజిటల్/ వర్చ్యువల్ కామవికారాలు

గమ్మత్తైన విషయం ఏమిటంటే భార్యాభర్తలిద్దరూ ఏదైనా సమస్య వచ్చినప్పుడు సంబంధం తెగిపోయినట్లు భావించి, సమస్యను వ్యతిరేక మార్గాల్లో పరిష్కరించడానికి ప్రయత్నిస్తారు. విషయాన్ని మరింత క్లిష్టతరం చేస్తూ, పురుషులు శారీరకంగా సన్నిహితంగా అనిపించకపోతే మాట్లాడటానికి లేదా వారి భావోద్వేగాలను పంచుకోవడానికి ఇష్టపడరు. స్త్రీలు తరచుగా భావోద్వేగపరంగా సన్నిహితంగా అనిపించకపోతే శారీరక సాన్నిహిత్యాన్ని కోరుకోరు.

పురుషులు ఏకత్వం తగ్గిపోయినట్లు, సంబంధం తెగిపోయినట్లు అనిపించినప్పుడు, వారు తరచుగా వినోద సాన్నిహిత్యం ద్వారా, శారీరక సాన్నిహిత్యాన్ని పొందడానికి ప్రయత్నిస్తారు. కలిసి సరదాగా ఏదైనా చేయటం ద్వారా లైంగికంగా దగ్గరవ్వాలని చూస్తారు. అయితే స్త్రీలకు అలా అనిపించినప్పుడు, తరచుగా మేధో సాన్నిహిత్యం ద్వారా భావోద్వేగ సాన్నిహిత్యాన్ని పొందడానికి ప్రయత్నిస్తారు. దేని గురించి అయినా మాట్లాడు కోవటం ద్వారా బహుశా వారి భావాలను పంచుకోగలమని భావోద్రేకంగా దగ్గర అవ్వాలని చూస్తారు.

దంపతులు సులభంగా ఒంటరితనం వలయాలతో చిక్కుకుపోతుంటారు. అప్పుడు వారు తమ జీవిత భాగస్వామి అవసరాలను తీర్చడానికి ఇష్టపడే ముందు వారి స్వంత సాన్నిహిత్యం అవసరాలను తీర్చాలని మరింత ఎక్కువగా డిమాండ్ చేస్తారు. ఇక్కడే ఎంత బాధగా ఉన్నా, ఒకరినొకరు క్రీస్తు మనసుతో ప్రేమించుకోవాలి (యోహాను 13:34-35; గలతీ 5:13; 6:2; ఎఫెసీ 4:2, 32; 1 పేతురు 4:8-10). తమ అవసరాల కంటే తమ సహధర్మచారి అవసరాలను ప్రేమగా తీర్చటానికి పూనుకొంటే ఒంటరితనం యొక్క చక్రాల నుండి సాన్నిహిత్యం యొక్క చక్రాలకు మారడానికి సహాయపడుతుంది. దేవుని సాయముతో ఏకత్వాన్ని పునరుద్ధరించుకొంటారు.

ఈ ఐదు సాన్నిహిత్యాలను సక్రమంగా చేసినప్పుడే, దంపతులు గాఢంగా ఒకరితో ఒకరు హత్తుకొని పెనవేసుకున్న ఏకత్వము గల వివాహాలను పొందగలరు. త్రియేక దేవుని ఆరాధించే మనము త్రిత్వములోని ఏకత్వమును అర్థం చేసుకొనే కొద్దీ ఆయన పోలికలోకి రూపాంతరం చెందుతూ వైవాహిక జీవితంలో దేవుని ఘనపరిచే రీతిగా ఏకత్వాన్ని అనుభవించాలి. జెకర్యా, ఎలిసబెతు వలె తరాలకు మాదిరిని అందించాలి.

ఇది ఏదో ఒక రోజులో, ఒకసారికి సాధించేది కాదు కానీ శ్రద్ధగా జీవితాంతం వరకు చేసే నిరంతర సాధనతో కూడినది. ఆత్మ నింపుదలతో, వాక్యముకు లోబడుతూ, స్వార్థాన్ని చంపివేస్తూ, సాతానుని ఎదిరిస్తూ దంపతులిద్దరూ ఒక్కడవ్వడం సంసారములో ఎంతో సమాధానము, సంతోషము, సంతృప్తి ఉంటుంది.

**– డా. జే. రత్న గ్రేస్,** వైజాగ్



# మాట్లాడు కోండి! ఒకరినొకరు అర్థం చేసుకోండి!

"ఇక్కడే నాకు కోపం వస్తుంది, కొంచెం అర్థం చేసుకో నాకెంత పని ఉందో. రేపటి బైబిల్‌స్టడీకి ప్రిపేర్ అవ్వాలి. రేపు స్కూల్ నుండి వచ్చాక టైం ఉండదు. రాగానే బాబుగాడితో ఆడాలి లేకపోతే వాడు ఊరుకోడు. ఈ ఫోన్‌కాల్స్ నా టైం తినేస్తున్నాయి", అని విసుక్కున్న రాజేష్‌ని చూసి సుమతికి ఎక్కడలేని చికాకు వేసింది.

"నాకూ వస్తుంది కోపం, ఎన్ని రోజులైంది కొంచెంసేపు కలసి మాట్లాడుకొని! ఉద్యోగం, పరిచర్య, ఇయు ఇదే నా జీవితం! పెళ్ళి చేసుకున్నది దీనికోసమేనా! నేను మీకో పనిమనిషిని... మీకు వంట చేసి పెట్టడానికి, బట్టలు ఉతకడానికి, పిల్లల్ని కనడానికి, పెంచడానికి, ఇంటికొచ్చిపోయే వాళ్ళకు సపర్యలు చేయడానికి... నాకొద్దుబాబు ఈ జీవితం! ఎక్కడికన్నా పారిపోదామనిపిస్తుంది. ఎన్ని వారాలయ్యింది అలా సరదాగా బయటకు వెళ్ళి! మా మామయ్య గారి అమ్మాయి శ్రావణి ఎన్నిసార్లు వాళ్ళింటికి రమ్మని అడిగింది? మీకు తీరదు, తీరిక చేసుకోరు. ఎందుకండీ కబుర్లు చెప్తారు. ప్రసంగాలు చేస్తారు?" అని మాటల తూటాలు ఝుళిపించిన సుమతి మాటలకు రాజేష్ పెద్దగా ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే ఇలాంటివి జీవితంలో మామూలు అయిపోయాయి. ఒక చెవితో విని వేరొక చెవి ద్వారా వదిలివేయాలని సలహా చెప్పిన సుబ్బారావు బ్రదరే మనకు రోల్‌మోడల్ అని మనస్సులో అనుకున్నాడు రాజేష్. రూంలోకి వెళ్ళి పాతనోట్సు, బైబిలు, కొన్ని పుస్తకాలు ముందేసుకుని కూర్చున్నాడు.

పెళ్ళయిన మొదటి సంవత్సరం బాగానే గడిచిపోయింది. రాజేష్ పనిచేసే స్కూల్ రాజమండ్రికి సమీపంలోని చిన్న గ్రామంలో ఉంటుంది. అందుకే రాజమండ్రిలో కాపురం పెట్టి ప్రతిరోజు బైక్ మీద స్కూలుకు వెళ్ళి వస్తూ ఉంటాడు. సుమతి కూడా బి.ఇడి. చేసింది కానీ సంవత్సరం తిరగకముందే బాబుగాడు కడుపులో పడడం, విపరీతమైన వేవిళ్ళు, నాలుగో నెలలోనే అమ్మగారింటికి వెళ్ళిపోవడం జరిగిపోయాయి. వారాంతంలో అప్పుడప్పుడు రాజేష్ వెళ్ళి చూడడం ఆ తర్వాత బాబు పుట్టిన నాలుగో నెలలో తిరిగి రాజమండ్రికి రావడం జరిగింది. తర్వాత రెండు సంవత్సరాలు బాబుగాడితోనే సరి పోయింది. వాడిని ఈ స్థాయికి తీసుకొని రావడానికి సుమతిలోని యౌవ్వనం సగం హరించిపోయినట్లైంది. ఇప్పుడు బాబుగాడికి మూడో సంవత్సరం నడుస్తుంది. రాజేష్‌కి ఇంటి పని పెద్దగా పట్టదు. చిన్నప్పటి నుండి గారాబంగా పెరిగిన కొడుకు కావటంతో, బజారుకు వెళ్ళి సరుకులు తేవడం,

కూరగాయలు తీసుకొని రావడం కానీ తెలియదు. వంటగదిలో అడుగుపెట్టడం ఆయనకు చాలా నామోషీగా అనిపిస్తుంది. అంట్లు కడగడానికి, ఇల్లు తుడువటానికి ఒక పని మనిషి ఉండేది. కానీ బట్టలు వాషింగ్ మెషిన్‌లో వేసి వాటిని ఆరేసి, ఆరిపోయిన వాటిని తిరిగి లోపలికి తెచ్చి, మడత పెట్టి సర్దడం, అన్నీ సుమతే చేసుకునేది. రాజేష్ ఖాళీగా ఉన్నా అవేవీ తన పని కాదన్నట్లు కూర్చొని టివి చూడడమో లేదా ఫోన్‌లో మాట్లాడడమో చేసేవాడు. ఇయు పిల్లలు వస్తే వాళ్ళతో గంటలకొద్దీ మాట్లాడేవాడు. బాబుగాడు ఏడుస్తుంటే, సుమతి వచ్చి ఎత్తుకోవలసిందేగాని పట్టించుకునేవాడు కాదు. కానీ ఇజియఫ్‌లో మంచి గ్రాడ్యుయేట్‌గా పేరుంది. ఎందుకంటే క్రమం తప్పకుండా ఇజియఫ్‌కి డబ్బులిచ్చేవాడు, ప్రతి ఇజియఫ్ మీటింగ్‌కు వెళ్ళేవాడు. బైబిల్‌స్టడీలు కూడా చక్కగా తీసుకుంటాడని పేరు. ప్రేమ గురించి, దయ గురించి తగ్గించుకొని చేసే పరిచారక నాయకత్వం గురించి బాగా చెప్పేవాడు. సుమతికి అతని జీవితం చాలా వింతగా కనపడేది.

సుమతి, ఇజియఫ్ మీటింగ్ నుండి వచ్చిన రాజేష్‌కు భోజనం వడ్డించి, అప్పుడే నిద్రలేచిన బాబుగాడిని నిద్ర పుచ్చడానికి వెళ్ళింది. బాబుని నిద్రపుచ్చుతుందేగాని, ఆమె మనస్సులో ఎంతో తీరని వేదన ఉంది. తన జీవితం తనకే రోత పుట్టిస్తుంది. ఇంట్లో భౌతిక వసతులన్నీ ఉన్నాయి. కానీ వైవాహిక జీవితంలో ఉండాల్సిన సంతోషం లేదు. తనతో జీవితం పంచుకుంటానని ప్రమాణం చేసిన భర్త తనకు అందుబాటులో లేకపోవడం వల్ల ఒకవిధంగా తాను ఒంటరిజీవితం అనుభవిస్తున్నట్లుగా భావిస్తుంది. చిన్నప్పుడే తల్లిని కోల్పోయిన సుమతి మారుతల్లి కాపుదలలో పెరిగింది. తనపై ప్రేమ చూపించేవారు లేని దినాలలో దేవుని ప్రేమ గురించి ఇయు మీటింగ్‌లో విని ప్రభువును రక్షకునిగా స్వీకరించి ఇయులో, ప్రభువులో ఎదుగుతూ వచ్చింది. రాజేష్ గురించి వ్యక్తులు మంచి సాక్ష్యం చెప్పిన కారణం చేత, ప్రార్థించి దేవుని చిత్తంగా ఎంచి పెళ్ళి చేసుకుంది. కానీ ఇప్పుడు అది నిజంగా దేవుని చిత్తమా లేక స్వంత ఇష్టమా అన్న ప్రశ్నలు తనను వేధిస్తున్నాయి. రాజేష్ జీవితంలో పైకి పెద్దగా కనిపించే పాపాలు లేనప్పటికీ, తన స్వంత శరీరంగా భావించాల్సిన భర్త తనను పట్టించుకోకపోవడం

చాలామందికి వారి జీవిత భాగస్వాముల అక్కరలు తెలియవు. వారు ప్రసంగాలు చేస్తారు, విద్యార్థులను కౌన్సిల్ చేస్తారు. కానీ అతి ప్రాముఖ్యమైన కుటుంబవ్యవస్థ సజావుగా సాగడానికి కావలసిన ఏకత్వం గురించి పట్టించుకోరు. అందుకే వారి పరిచర్య ఓటికుండ శబ్దం వస్తుంది. శత్రువైన సాతాను వారిని తన వలలో బంధించి దేవునికి పనికిరాని పాత్రలుగా మార్చివేయగలడు.

భరించలేకపోతుంది. భర్త తనతో మనస్సు విప్పి మాట్లాడాలని ఎంత కోరుకున్నప్పటికీ ఆ కోర్కె అందని ద్రాక్ష లాగా మిగిలిపోయింది. ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతూనో లేక పాటలు వింటూ బిజీగా ఉంటాడు గానీ, తనతో మాట్లాడడానికి గానీ లేక తన మాటలు వినడానికి గానీ సుముఖత చూపడు. కొన్నిసార్లు సుమతి, తను కూడా ఇయు పిల్లల రూపంలో వస్తేగాని నాతో మాట్లాడడేమో అని అనుకొని తన మీద తానే జాలిపడుతుండేది.

బాబుగాడిని నిద్రకేసి వచ్చేటప్పటికి రాజేష్ భోజనం చేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. తన భార్య ప్రక్కన కూర్చొని, ఆమె భోజనం చేస్తుండగా కొంచెంసేపు ఆమెకు తోడు ఉందామన్న ఇంగితజ్ఞానం కూడా అతనికి లేదు. సుమతి హడావిడిగా భోజనం చేసి వంటగదిలో సామానులు సర్దుకొని, బెడ్‌రూంకి చేరుకుంది. ఆమె మనస్సులో తన భర్తతో ఏదో చెప్పుకుందామన్న కోరిక చాలా తీవ్రంగా ఉంది. రాజేష్ సుమతితో, బైబిల్ తీసుకొనిరా ప్రార్థన చేసుకుందాం అనగానే, యాంత్రికంగా బైబిల్స్ తీసుకొని వచ్చి కూర్చుంది. వాక్యధ్యానం చేసుకొని ప్రార్థన ముగించగానే, రాజేష్ నాకు నిద్రముంచుకొస్తుందంటూ నిద్రకుపక్రమించాడు. కొంచెంసేపు మాట్లాడుకుందామండి అన్న ఆమె ముఖంలోకి చూస్తూ, "ఇవాళ చాలా అలసిపోయాను, రేపు మాట్లాడుకుందాం" అన్న అతని అభ్యర్థనను తిరస్కరించలేకపోయింది. ఆమె జీవితంలో అలాంటి రేపులు ఎండమావులుగానే మిగిలిపోయాయి. రాజేష్ గుర్రుపెట్టి నిద్రపోతుంటే సుమతి మనసులో ఎన్నో ఆలోచనలు స్వైరవిహారం చేస్తున్నాయి. అసలు రాజేష్ జీవితంలో తను ఎవరు? తనకు అతను ఇచ్చే విలువ ఎంత? నేను – పరిచర్య, ఈ రెండింటిలో నాకు

అతను ఏ ప్రాధాన్యత ఇస్తాడు? ఇతని వ్యక్తిత్వం ఏమిటి? ఇతన్ని ప్రభావితం చేసే విషయాలు ఏమిటి? అతనికి నా అవసరాలు తెలుసా? నన్ను అతను ఎలా ఊహించుకుంటాడు? అతను ఇష్టపడే సుమతి ఎలా ఉంటుంది. ఇలా ఎన్నో సమాధానాలు లేని ప్రశ్నలతో ఆమె తల వేడెక్కిపోతుంది. నేనెవరికి అక్కరలేకపోతే, నాకంటూ నా యింట్లో ఒక స్థానం లేకపోతే నేను బ్రతకడం ఎందుకు?

సుమతికి తన మీద తనకే జాలి ముంచుకొస్తుంది. కళ్ళ వెంట నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి. తల క్రింద దిండు తడిచిపోతుంది. తన గురించి ఏమీ పట్టని భర్త చురుకైన ఇజియఫ్ సభ్యునిగా చలామణి అవుతున్నాడు. ఎవరికి చెప్పి ఈ గుండె బరువు దించుకోవాలి? ఇలా అనుకుంటూ ఆ రాత్రివేళ మంచం ప్రక్కనే మోకరించి, దేవా! నీవే నా దిక్కు. నీవే నా భర్తకు నా గురించి చెప్పు. నా అక్కర తీర్చు ప్రభూ! అంటూ నిశ్శబ్దంగా మొరపెట్టింది.

వివాహవ్యవస్థను ప్రారంభించిన దేవుడు ఆది. 2:18లో దానికి మూలకారణాన్ని కూడా వ్రాయించాడు. భార్యాభర్తలిద్దరిని ఒకే వ్యక్తిగా చేసే వివాహప్రక్రియ వారిలోని ఒంటరితనాన్ని పారద్రోలుతుంది. ఏకత్వమనే బృహత్ క్రియలో ఒకరితోఒకరు తమ భావోద్రేకాలను, ఆశలను, ఇష్టాయిష్టాలను, భయాలను, ప్రణాళికలను పంచుకోవడమనే విషయం తప్పనిసరి. ఒకరినొకరు అర్థం చేసుకొనకుండా ఏకత్వం సాధ్యం కాదు. ఒకరితో ఒకరు తమ భావాలు అరమరిక లేకుండా పంచుకున్నప్పుడే ఒకరినొకరు అర్థం చేసుకోగలరు. ఇలా పంచుకోవటం వలన జరిగే గొప్ప మేలు ఏమిటంటే, ఒకరి 'అక్కరలను' ఒకరు తెలుసుకుంటారు. అక్కరలు తీరకుండా జీవితం సఫలం కాదు. సుమతి యొక్క అయోమయస్థితికి కారణం ఇదే! తన అక్కరలు తన భర్తకు ఎలా తెలుస్తాయి? అతను తీరికగా మాట్లాడటానికి సమయం వెచ్చించడు. దాని కంటే ఒక పుస్తకం చదువుకోవడమో లేక ఒక సందేశం వినడమో మంచిదనుకునే బుద్ధిహీనుడు. ఒకరితోఒకరు మాట్లాడుకోకపోతే, భావోద్రేకాలు పంచుకొనకపోతే మానసిక కారణాల వలన వచ్చే జబ్బులు (Psychosomatic) వస్తాయని వైద్యశాస్త్రం నొక్కి వక్కాణిస్తుందని తెలియని మూర్ఖుడు మన రాజేష్. ఈ సమస్య ఇలానే కొనసాగితే సుమతి త్వరలో మానసిక కృంగుదలలోనికి దిగజారి తాను, తనతోపాటు తన బిడ్డ జీవితాన్ని నాశనం చేసుకుంటుందని ఎరుగని రాజేష్‌లు ఎందరో మన గ్రాడ్యుయేట్లలో వున్నారు. చాలామందికి వారి జీవిత భాగస్వాముల అక్కరలు తెలియవు. వారు ప్రసంగాలు చేస్తారు, విద్యార్థులను కౌన్సిల్ చేస్తారు. కానీ అతి ప్రాముఖ్యమైన కుటుంబవ్యవస్థ సజావుగా సాగడానికి కావలసిన ఏకత్వం గురించి పట్టించుకోరు. అందుకే వారి పరిచర్య ఓటికుండ శబ్దం వస్తుంది. శత్రువైన సాతాను వారిని తన వలలో బంధించి దేవునికి పనికిరాని పాత్రలుగా మార్చివేయగలడు. భార్యాభర్తలారా మాట్లాడుకోండి! ఒకరినొకరు అర్థం చేసుకోండి! అక్కరలు ఎరగండి! అవి తీర్చుటకు ద్వారాలు తెరవండి! రండి మాట్లాడుకుందాం, ఒకటైపోదాం!

– విజే డెస్క్




ఒకరితో పోల్చుకోవడం/పోటీతత్వంతో ఆలోచించడం, నేను గెలవాలి ఎదుటివారు ఓడిపోవాలి, సరిగా వినకపోవడం, సమర్థించుకోవటం, ఫిర్యాదు చేయడం, మొండిగా వ్యవహరించడం, అభద్రతాభావం, తన గురించి తాను చెప్పుకోవడం, ఇతరుల పాపాలు, తప్పులను ఎత్తిచూపడం, అధికారానికి లోబడకపోవడం, బాధించే మనస్తత్వం, తోటివారితో కలిసి పనిచేయలేకపోవడం, వేరే వారి పనులకు నా ఉద్దేశ్యాలను ఆపాదించడం, విమర్శనాత్మక ధోరణి, నేను పనిచేయక పోవడానికి గల కారణం ఇతరులు అని నిందించడం, తప్పును అంగీకరించక పోవడం, ఎప్పుడూ చింతించడం..మొదలగునవి.



# సేవక నాయకత్వం

కఠినమైన క్రమశిక్షణ కలిగి
బాహ్యబుద్ధికన్నా మిన్నయైన
ప్రభువును మాత్రమే లక్ష్యపెట్టగలిగే
అంతరంగ స్వభావాన్ని
దావీదు వలె నిరూపించుకొందాం

దేవుని ఖచ్చితమైన స్వరాన్ని
వినగలిగి, కానరాని గమ్యమైనా
అది గుండెకు గాయం కలిగించినా
పలికింది నా ప్రభువు కదా అని
అబ్రాహాము వలె విడువని విశ్వాసాన్ని చాటుకుందాం

స్వకీర్తి కోరక యేసునామ ఘనతకై
సిలువ మరణం పొందునంతగా
తన్ను తాను తగ్గించుకొన్న
ప్రభువైన క్రీస్తు వలె
అవమానమును నిర్లక్ష్యపెడదాం

హృదయాన్ని కుమ్మరించి నరకపు
అంచుల దాకా కృపతో వెంటాడే
రక్షకుని నిమిత్తమై స్థిరంగా నిలబడి
సంసోను వలె గాక
యౌవ్వనబలమంతా ఆయనకై అర్పించుదాం

లెక్కచెప్పవలసిన సమయానికి ముందే
ఆలస్యం కాకముందే
పిలుపును గ్రహించి, తలాంతులు ఉపయోగిస్తూ
నోవహు వలె ఒక్క ప్రశ్న వేయక
యావత్తు చేయడానికి సిద్ధపడదాం

ఆయన తపించే విషయం
మన హృదయాన్ని తపింపజేసేంతగా
పరిచర్యను సొంతం చేసుకొని వాడబడుతూ
నెహెమ్యా వలె
పట్టువిడవక ప్రార్థించుదాం

తూటాలకు భయపడని సైనికునివలె
శ్రమకు ఎదురు నిలిచి,
నియమం ప్రకారం పోరాడుచూ
లోక వ్యాపారాలలో చిక్కుకొనక
దండులో చేర్చుకున్న తండ్రిని సంతోషపెట్టుదాం

పాటుపడిన వ్యవసాయకుడే మొదట
ఫలములో పాటు పుచ్చుకొనునని ఎరిగి
పరిస్థితులు ఎలా ఉన్నా
ప్రభువు పరిచర్యలో ప్రయాసపడదాం
ప్రభువును మహిమపరుద్దాం

క్రీస్తుకు కానుక వలె మన
జీవితాలను సమర్పించుకొందాం
గొప్పగా సేవక నాయకత్వాన్ని నిర్వహిద్దాం

– గంగా హెప్సిబా, నంద్యాల
(ఇటీవల నంద్యాలలో జరిగిన యల్‌టి క్యాంప్ డివోషన్స్ ఆధారంగా)

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-05-2025**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# నాయకుడంటే నీలా వుండాలి!

ఎన్నివేల మెట్లు దిగి వచ్చావో
చివరి మెట్టుమీద నన్ను కలవడానికి
అందరూ నాలో మట్టినే చూశారు
నువ్వు మాత్రం మెరుపును చూశావు

నకిలీ నాయకులంతా
పొడవాటి అంగీలుగా మారి
అంత:పురాల చుట్టూ అల్లుకుంటూవుంటే
నువ్వు మాత్రం
మురికి వాడల మధ్య
వజ్రాల్ని సానబెడుతూ కనిపించావు

సత్య సూత్రాల్ని
ఉపమానాల ఊటలుగా మార్చి
మా ప్రాణనాడుల్లోకి ప్రవహింపజేశావు
నువ్వు వదలి వెళ్ళే దూరాల్ని మేము చేరేలా
నువ్వు విత్తివెళ్ళే పంటను మేము కోసేలా
విశ్వదర్శనాన్ని మాలో విస్తరింపజేశావు

దయ్యం చేతిలో ఓడినప్పుడు
అవిశ్వాస అలలకింద మునిగినప్పుడు
పనికిరాని మా ప్రగల్భాలను వెక్కిరిస్తూ
కోడి మూడుసార్లు కూసినప్పుడు
అస్తమించిన మా ఆత్మస్థైర్యం మీద
ఆశల పొద్దయి పొడిచావు

నమ్రత నాయకుని లక్షణమని
నీ చేతిలో నీళ్ళ గిన్నె చూశాకే తెలిసింది
లేకపోతే కుర్చీలు కిరీటాలే
మా నాయకత్వ నిర్వచనాలు

మమ్మల్ని కట్టడానికే గదా
నువ్వు గోధుమ రొట్టెలా విరిగిపోయావు
జట్టును పచ్చని చెట్టులా నిలబెట్టడానికి
నువ్వు ఎండిన కొయ్య మీద ఒరిగిపోయావు

అధికార వికార రూపాల
పీడకలలు మా నాయకులు!
పదవుల్ని గెలిచారు తప్ప
హృదయాల్ని కాదు
నువ్వు మాత్రం సేవకనాయకుడివై
ప్రపంచాన్నే గెలిచావు

నాయకత్వ చరిత్రలో
నువ్వో కొత్తశకం
నాయకత్వ పుటల్లో
నీదే అసలు సంతకం

– ప్రసాద్ తాళ్ళూరి

